మీరే చదువరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. ప్రపంచవ్యాప్త వార్తలు చదవండి...

PRGI REGD NO: TGTEL/25/A1385

# నేటి ఈవార్తలు

NETI EVARTHALU దినపత్రిక

www.evarthalu.com

మీరే విలేకరి.. క్యూఆర్ కోడ్ స్కాన్ చేయండి.. మీ ప్రాంతంలోని వార్తలు పంపండి..

శుక్రవారం FRIDAY 6-3-2026 | జగిత్యాల JAGITIAL | పేజీలు: 8 PAGES:8 | వెల రూ.2.00 PRICE: 2.00 | సంపుటి: 1 Volume:1 | సంచిక: 246 Issue: 246

Published from Jagitial
Circulated to Telangana

06 మార్చి 2026 - శుక్రవారం శ్రీ విశ్వావసు నామ సంవత్సరం ఉత్తరాయణం - శిశిర ఋతువు ఫాల్గుణ మాసం - కృష్ణపక్షం సూర్యోదయం - ఉ. 6:34 సూర్యాస్తమయం - సా. 6:20 తిథి తదియ సా. 5:57 వరకు తరువాత చవితి సంస్కృత వారం భృగు వాసరః నక్షత్రం హస్త ఉ. 9:26 వరకు తరువాత చిత్తా యోగం గండ ఉ. 7:02 వరకు కరణం విష్టి సా. 5:57 వరకు బవ ఉ. 6:32ం వరకు వర్జ్యం సా. 6:04 నుండి రా. 7:47 వరకు దుర్ముహూర్తం ఉ. 8:55 నుండి ఉ. 9:42 వరకు మ. 12:50 నుండి మ. 1:38 వరకు రాహుకాలం ఉ. 10:59 నుండి మ. 12:27 వరకు యమగండం మ. 3:23 నుండి సా. 4:52 వరకు గుళికాకాలం ఉ. 8:02 నుండి ఉ. 9:31 వరకు బ్రహ్మముహూర్తం తె. 4:58 నుండి తె. 5:46 వరకు అమృత ఘడియలు తె. 4:22 నుండి ఉ. 6:05 వరకు అభిజిత్ ముహూర్తం మ. 12:04 నుండి మ. 12:51 వరకు



తెలంగాణలో ఎండలు మండిపోతున్నాయి. భానుడి భగభగతో పగటిపూట ఉష్ణోగ్రతలు క్రమంగా పెరుగుతున్నాయి. మార్చి మొదటి వారంలోనే ఎండలు తీవ్రస్థాయికి చేరుకుంటున్నాయి. గురువారం ములుగు జిల్లా మంగపేటలో అత్యధికంగా 39 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. ఆదిలాబాద్, ఖమ్మం, జగిత్యాలలో 38.9 డిగ్రీలు, మంచిర్యాలలో 38.7 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. రాను న్న రోజుల్లో ఉష్ణోగ్రతలు మరింత పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

# గిప్పుడే ఏం ఎండలు!

## ములుగులో 39 డిగ్రీల ఉష్ణోగ్రత

### ఉత్తర తెలంగాణలో భానుడి భగభగ.. ఏపీకి వాతావరణ శాఖ హెచ్చరిక

### కొత్త రికార్డులు నమోదయ్యే చాన్స్.. పలు జిల్లాలకు వడగాల్పుల ముప్పు

(ఈవార్తలు న్యూస్ నెట్‌వర్క్)

మేడ్చల్ మల్కాజ్‌గిరి, హైదరాబాద్, సిద్దిపేట తదితర జిల్లాల్లో 37 డిగ్రీల ఉష్ణోగ్రత నమోదైంది. అటు.. ఏపీలోనూ ఎండలు క్రమంగా పెరుగుతున్న నేపథ్యం లో, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర విపత్తుల నిర్వహణ సంస్థ (ఏపీఎస్‌డీఎంఏ) కీలక హెచ్చరిక జారీ చేసింది. ఈ ఏడాది వేసవి తీవ్రత గతం కంటే ఎక్కువగా ఉంటుందని, కొన్ని ప్రాంతాల్లో ఉష్ణోగ్రతలు కొత్త రికార్డులు సృష్టించే అవకాశం ఉందని అంచనా వేసింది. ఈ మేరకు ఏపీఎస్డీఎంఏ మేనే జింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ వివరాలు వెల్లడించారు. ఏపీ విపత్తుల నిర్వహణ సంస్థ అంచనాల ప్రకారం..ఈ మార్చి నెల నుంచే సాధారణం కంటే ఎక్కువ ఉష్ణోగ్రతలు నమోదయ్యే సూచనలు ఉన్నాయి. ముఖ్యంగా శ్రీకాకుళం, ప్రకాశం, కర్నూలు, నంద్యాల, అనంతపురం, శ్రీసత్యసాయి, అన్నమయ్య, కడప జిల్లాల్లో అధిక ఉష్ణోగ్రతలు నమోదయ్యే అవకాశం ఉంది. అలాగే కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, మార్కాపురం జిల్లాల్లో ఎక్కువ రోజుల పాటు వడగాలులు వీచే - 2 వ పేజీలో...





# ఫైనల్‌కు టీమిండియా

## భయపెట్టిన బెతెల్!.. ఒంటరి పోరు.. శతకం వృథా

### మలుపు తిప్పిన బుమ్రా.. ఉత్కంఠపోరులో భారత్ విజయం.. ఫైనల్‌లో కివీస్‌తో పోరు

# నలుగురు కార్మికులు మృతి

## హైదరాబాద్-టోలీచౌకీలో ఘోర ప్రమాదం

### విరిగిన గోవా కర్రలు.. భవనంపై నుండి పడి దారుణం

### మరికొందరికి గాయాలు.. ఆసుపత్రికి తరలింపు



హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): హైదరాబాద్‌లోని టోలీచౌ కీలో ఘోర ప్రమాదం జరిగింది. నాలుగు అంతస్తుల భవనం నిర్మాణం కోసం కట్టిన గోవా కర్రలు కూలి నలుగురు కార్మికులు మృతి చెందగా, ఆరుగురికి గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ప్రమాదం సమయంలో 10 నుండి 12 మంది కార్మికులు పని చేస్తున్నట్లు తెలుస్తోంది. భవనం నిర్మాణం కోసం గోవా కర్రలతో కట్టిన పరంజా తరువాయి 2 వ పేజీలో...

## బంగారం-వెండి ధరలు



| | |
|---|---|
| బంగారం (గ్రాము-24 క్యారెట్స్): | రూ.16,288 |
| వెండి (గ్రాము): | రూ.295 |
| ప్లాటినం (గ్రాము): | రూ.6,399 |

## విశ్వవాణి




చైనాకు చెందిన ఓ ఉద్యోగి.. లక్కీ డ్రాలో ఏకంగా ఏడాది పాటు పెయిడ్ లీవ్స్‌ను పొందాడు. షెంజెన్‌లోని ఓ కంపెనీ వార్షిక సదస్సులో భాగంగా నిర్వహించిన పార్టీలో లక్కీ డ్రాను ఏర్పాటు చేశారు. ఆ డ్రాలో ఈ భారీ బహుమతి పొందడం గమనార్హం.

# బీజేపీకి పైసలే పైసల్!

### 2024-25లో రూ. 6,769 కోట్లు.. ఏడీఆర్ నివేదికలో వెల్లడి



2024-25 ఆర్థిక సంవత్సరంలో భారతీయ జనతా పార్టీ ఆదాయం ఆకాశాన్నంటింది. దేశంలోని ఆరు ప్రధాన జాతీయ పార్టీల మొత్తం ఆదాయం రూ. 7,960 కోట్లుగా నమోదవగా, అందులో సింహభాగం అంటే దాదాపు 85 శాతం (రూ. 6,769 కోట్లు) ఒక్క బీజేపీకే దక్కింది 'అసోసియేషన్ ఫర్ డెమోక్రటిక్ రీఫార్మ్స్' (ఏడీఆర్) తాజా నివేదిక ప్రకారం, గత ఏడాదితో పోలిస్తే పార్టీ ఆదాయంలో భారీ వృద్ధి కనిపిస్తోంది.


న్యూఢిల్లీ: ప్రధాన ప్రతిపక్షమైన కాంగ్రెస్ పార్టీ రూ.918 కోట్లతో రెండో స్థానంలో నిలవగా, సీపీఎం (రూ. 172 కోట్లు), బీఎస్పీ (రూ. 58.5 కోట్లు), ఆమ్ ఆద్మీ పార్టీ (రూ. 39 కోట్లు) తర్వాతి స్థానాల్లో ఉన్నాయి. ఈ గణాంకాలు దేశ రాజకీయ నిధుల్లో అధికార బీజేపీ ఏ స్థాయి ఆధిపత్యాన్ని ప్రదర్శిస్తోందో స్పష్టం చేస్తున్నాయి.వచ్చిన ఆదాయాన్ని ఖర్చు చేయడం లోనూ బీజేపీ ముందంజలో ఉంది. పార్టీకి అందిన మొత్తం ఆదాయంలో 55.76 శాతం (సుమారు రూ. 3,774 కోట్లు) ఎన్నికల ప్రచారం, పార్టీ నిర్వహణ మరియు ఇతర కార్యక్రమాల కోసం వెచ్చించినట్లు ఏడీఆర్ నివేదిక వెల్లడించింది. ముఖ్యంగా సార్వత్రిక ఎన్నికల సమయంలో అడ్వర్టైజ్‌మెంట్లు, ప్రయాణ ఖర్చులు మరియు క్షేత్రస్థాయిలో పార్టీ బలోపేతం కోసం ఈ నిధులను భారీగా ఉపయోగించారు. విరాళాల రూపంలో అందిన ఈ నిధులు రాజకీయ పార్టీల ఆర్థిక బలాన్ని ప్రతిబింబిస్తుండగా, ఇతర జాతీయ పార్టీల ఆదాయంతో పోలిస్తే బీజేపీకి వస్తున్న నిధులు దాదాపు ఏడు రెట్లు అధికంగా ఉండటం గమనార్హం.



## తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా

### మహారాష్ట్రకు జిష్ణుదేవ్ వర్మ బదిలీ

న్యూఢిల్లీ: తెలంగాణ కొత్త గవర్నర్‌గా హిమాచల్ ప్రదేశ్ గవర్నర్ శివప్రతాప్ శుక్లాను నియమిస్తూ కేంద్రం నిర్ణయం తీసుకుంది. ప్రస్తుతం తెలంగాణ గవర్నర్‌గా పనిచేస్తున్న జిష్ణు దేవ్ వర్మను మహారాష్ట్రకు బదిలీ చేసింది. అదేవిధంగా పలు రాష్ట్రాలకు కొత్త గవర్నర్లు నియమితులయ్యారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్ వినయ్ కుమార్ సక్సేనాను లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్‌గా నియమించారు. ఢిల్లీ లెఫ్టినెంట్ గవర్నర్‌గా తరువాయి 2 వ పేజీలో...



# మూడో బిడ్డను కంటే 25,000

## ఏపీ సీఎం చంద్రబాబు ప్రకటన

### నెలకు వెయ్యి చొప్పున పౌష్టికాహార సాయం, ఉచిత విద్య

### ప్రసూతి సెలవులు ఏడాదికి పెంపు.. తండ్రులకు రెండు నెలల సెలవు

### ఏప్రిల్ 1 నుచీ.ంచి నూతన జనాభా విధానం.. పడిపోతున్న జననాల రేటుపై ఆందోళన

అమరావతి, మార్చి 5 (ఈవార్తలు): మూడో బిడ్డను కనే దంపతులకు రూ.25 వేల ప్రోత్సాహకం అందిస్తామని ఏపీ సీఎం చంద్రబాబు తెలిపారు. రాష్ట్రంలో పడిపోతున్న జననాల రేటును అరికట్టి, జనాభా వృద్ధిని ప్రోత్సహించేందుకు సరికొత్త 'జనాభా నిర్వహణ విధానం' ముసాయిదాను ఆయన గురువారం అసెంబ్లీలో ఆవిష్కరించారు. ఇందులో భాగంగా మూడో బిడ్డను కనే దంపతులకు రూ. 25 వేల ప్రోత్సాహకం అందించాలని ప్రభుత్వం ప్రతిపాదించింది. ముసాయిదా పాలసీ వివరాలను సీఎం తరువాయి 2 వ పేజీలో...



## రాజ్యసభకు సింఘ్వీ, వేం నామినేషన్

హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): కాంగ్రెస్ తరఫున తెలంగాణ నుంచి రాజ్యసభ అభ్యర్థులుగా అభిషేక్ మను సింఘ్వీ, వేం నరేందర్‌రెడ్డి నామినేషన్ దాఖలు చేశారు. ఎన్నికల అధికారి ఉపేందర్‌రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. దీనికి సీఎం రేవంత్‌తో పాలు పలువురు మంత్రులు హాజరయ్యారు. ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపీలు పెద్ద - 2 వ పేజీలో...



## కవిత నోట 'జై ఆంధ్ర'

తిరుమల శ్రీవారి దర్శనానికి జాగృతి అధ్యక్షురాలు

రేణిగుంట విమానాశ్రయంలో జై ఆంధ్ర అంటూ నినాదం

తన పార్టీకి స్వామి ఆశీస్సులు ఉన్నాయని వ్యాఖ్య

## రాశి ఫలాలు
6.3.2026

మేషం: ఉద్యోగయత్నాలు మందకొడిగా సాగుతాయి. చేపట్టిన పనులలో శ్రమాధిక్యత కలుగుతుంది. కుటుంబ సభ్యుల నుండి ఒత్తిడులు పెరుగుతాయి. ఆలయ దర్శనాలు చేసుకుంటారు. వ్యాపార, ఉద్యోగాలలో కొన్ని సమస్యలు తప్పవు. ముఖ్యమైన వ్యవహారాల్లో తొందరపాటు నిర్ణయాలు చేయడం మంచిది కాదు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి.

వృషభం: చేపట్టిన పనుల్లో అవాంతరాలు కలుగుతాయి. వ్యాపారాలలో ఒడిదుడుకులు అధికమవుతాయి. సన్నిహితుల నుంచి కీలక సమాచారం అందుతుంది. నూతన ఋణాలు చేస్తారు. కుటుంబ వ్యవహారాలలో ఆలోచనలు నిలకడగా ఉండవు. ఉద్యోగాలలో నిరుత్సాహ వాతావరణం ఉంటుంది.

మిధునం: వ్యయప్రయాసలతో కాని పనులు పూర్తికావు. దూరపు బంధువుల నుండి ఆసక్తికర సమాచారం సేకరిస్తారు. బంధువులతో వివాదాలు చికాకు పరుస్తాయి. వ్యాపార, ఉద్యోగాలలో బాధ్యతలు పెరుగుతాయి. కొన్ని వ్యవహారాలలో ఆకస్మికంగా నిర్ణయాలు మార్చుకుంటారు. ఆర్థిక పరిస్థితి అంతగా అనుకూలించదు.

కర్కాటకం: ఆరోగ్య విషయంలో జాగ్రత్త అవసరం. చేపట్టిన పనులలో శ్రమ అంతగా ఫలించదు. బంధువులతో వివాదాలు తప్పవు. మిత్రులతో మాటపట్టింపులు ఉంటాయి. వ్యాపారాలు, ఉద్యోగాలలో చికాకులు పెరుగుతాయి. పాత ఋణాలు తీర్చడానికి నూతన ప్రయత్నాలు చేస్తారు. వృధా ప్రయాణాలు చేయవలసి వస్తుంది.

సింహం: సంఘంలో గౌరవ మర్యాదలు పెరుగుతాయి. దూరపు బంధువుల కలయిక ఆనందం కలిగిస్తుంది. స్థిరాస్తి కొనుగోలు చేస్తారు. వ్యాపారాలు లాభాల బాట పడతాయి. ఉద్యోగాలలో ఆశించిన పురోగతి సాధిస్తారు. విందువినోదాది కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన పనులు సకాలంలో పూర్తి అవుతాయి.

కన్య: వ్యాపార, ఉద్యోగాలలో సమస్యాత్మక వాతావరణం ఉంటుంది. కుటుంబ సభ్యులతో వివాదాలు పరిష్కారం అవుతాయి. స్వల్ప అనారోగ్య సమస్యలు బాధిస్తాయి. చేపట్టిన పనులు మందగిస్తాయి. దూరపు బంధువులను కలుసుకుంటారు. ఆకస్మిక ప్రయాణ సూచనలు ఉన్నవి. దైవదర్శనాలు చేసుకుంటారు.

తుల: ఆప్తుల నుండి శుభకార్య ఆహ్వానాలు అందుతాయి. ఇంటా బయట ఆశ్చర్యకరమైన సంఘటనలు చోటుచేసుకుంటాయి. మొండి బాకీలు వసూలవుతాయి. వ్యాపార, ఉద్యోగాలలో ప్రోత్సాహకర వాతావరణం ఉంటుంది. సన్నిహితులతో విందు వినోద కార్యక్రమాల్లో పాల్గొంటారు. చేపట్టిన వ్యవహారాలలో విజయం సాదిస్తారు.

వృశ్చికం: రాజకీయ ప్రముఖుల నుండి అరుదైన ఆహ్వానాలు అందుతాయి. దీర్ఘకాలిక వివాదాలు పరిష్కారవుతాయి. ఆకస్మిక ధన లాభ సూచనలు ఉన్నవి. వ్యాపార, ఉద్యోగాలలో అనుకూల వాతావరణం ఉంటుంది. విలువైన వస్తువులు కొనుగోలు చేస్తారు. చిన్ననాటి మిత్రులతో పాత జ్ఞాపకాలను పంచుకుంటారు.

ధనస్సు: దైవచింతన పెరుగుతుంది. ఖర్చుల విషయంలో పునరాలోచన చేయడం మంచిది. ముఖ్యమైన పనుల్లో ఊహించని ఆటంకాలు కలుగుతాయి. వ్యాపార ఉద్యోగాలు అంతంత మాత్రంగా సాగుతాయి. నూతన ఋణప్రయత్నాలు చేస్తారు. ఆత్మీయులతో చిన్నపాటి వివాదాలు తప్పవు.

మకరం: వ్యాపార వ్యవహారాల్లో పెద్దల సలహాలు తీసుకుని ముందుకు సాగడం మంచిది. ముఖ్యమైన వ్యవహారాలు నిదానంగా సాగుతాయి. కుటుంబ సభ్యులతో కొన్ని వివాదాలు చికాకు పరుస్తాయి. ఉద్యోగాలలో కొత్త సమస్యలు ఎదురవుతాయి. ఆర్థిక పరిస్థితి నిరాశ పరుస్తుంది. దూరప్రయాణాలు వాయిదా వేయడం మంచిది.

కుంభం: నూతన వాహనయోగం ఉన్నది. విద్యార్థులు పోటీపరీక్షల్లో విజయం సాధిస్తారు. వృత్తి వ్యాపారాలలో ముఖ్య నిర్ణయాలు తీసుకుంటారు. వ్యాపార ఉద్యోగాలలో నూతన ఆశలు చిగురిస్తాయి. సన్నిహితుల నుండి శుభవార్తలు అందుతాయి. ఆర్థిక లావాదేవీలు ప్రోత్సాహకరంగా సాగుతాయి.

మీనం: నూతన వాహన యోగం ఉన్నది. సమాజంలో పలుకుబడి కలిగిన వ్యక్తుల పరిచయం. స్థిరాస్తి కొనుగోలుకు ఆటంకాలు తొలగుతాయి. వ్యాపార విస్తరణకు అవరోధాలు తొలగుతాయి. ఉద్యోగాలలో పదోన్నతులు పెరుగుతాయి. కుటుంబ సభ్యులతో శుభకార్యాలలో పాల్గొంటారు. మొండి బాకీలు వసూలవుతాయి.

# గిప్పుడే ఏం ఎండలు!



**మొదటి పేజీ తరువాయి**

ప్రమాదం ఉందని హెచ్చరించింది. మార్చి నుంచి మే నెలల మధ్య కాలంలో శ్రీకాకుళం, ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, సత్యసాయి, అన్నమయ్య, కడప, చిత్తూరు, తిరుపతి జిల్లాల్లోని కొన్నిప్రాంతాలు మినహా మిగిలిన ప్రదేశాల్లో సాధారణం కంటే ఎక్కువ స్థాయిలో ఉష్ణోగ్రతలు నమోదు అయ్యే అవకాశం ఉందని తెలిపింది. గుంటూరు, బాపట్ల, పల్నాడు, ప్రకాశం, మార్కాపురం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల జిల్లాల్లో తీవ్రమైన వడగాలులు వీస్తాయని సంస్థ అంచనా వేస్తోంది. పెరుగుతున్న ఎండల తీవ్రత దృష్ట్యా ఎలాంటి ప్రాణ నష్టం జరగకుండా ముందస్తు చర్యలు చేపడుతున్నామని ఎండీ ప్రఖర్ జైన్ వివరించారు. జిల్లా యంత్రాంగాలతో సమన్వయం చేసుకుంటూ, ఎప్పటికప్పుడు ప్రజలకు హెచ్చరికలు జారీ చేయడం ద్వారా ప్రాణనష్టాన్ని నివారించగలమని ఆయన తెలిపారు. ఎండల తీవ్రత, తీసుకోవాల్సిన జాగ్రత్తలపై సమాచారం కోసం ప్రజలు టోల్ ఫ్రీ నంబర్లు 112, 1070, 18004250101లను సంప్రదించాలని సూచించారు.

### వేసవి.. జాగ్రత్తలివీ

- ఎండల నుంచి ముందుజాగ్రత్తగా ఇంటి వాతావరణం చల్లదనం కోసం పైకప్పులపై వైట్ పెయింట్, కూల్ రూఫ్ టెక్నాలజీ, క్రాస్ వెంటిలేషన్, థర్మోకోల్ ఇన్సులేషన్ ఏర్పాటు చేసుకోవాలి
- మేడపైన మొక్కలు, ఇంట్లో మొక్కలు (ఇండోర్ ప్లాంట్స్) భవనాన్ని చల్లగా ఉంచుతాయి. ఉష్ణతాపాన్ని తగ్గిస్తాయి.
- వంటగది తలుపులు, కిటికీలను తీసివుంచి తగినంత గాలి వచ్చేవిధంగా చూసుకోవాలి
- మధ్యాహ్న సమయంలో బయటికి వెళ్లాలంటే తప్పకుండా గొడుగు వెంట తీసుకెళ్తే మంచిది.
- తెలుపు రంగు, పలుచటి కాటన్ వస్త్రాలు ధరించడం, కర్చీఫ్ కట్టుకోవడం , టోపి పెట్టుకోవడం, కళ్ళ రక్షణ కోసం నాణ్యమైన సన్ గ్లాసెస్ ఉపయోగించడం వంటి జాగ్రత్తలు పాటించాలి.
- గర్భిణులు, బాలింతలు, చిన్నపిల్లలు, వృద్ధులు వీలైనంత వరకు ఇంట్లోనే జాగ్రత్తగా ఉండాలి.
- ద్విచక్ర వాహనదారులు తప్పకుండా హెల్మెట్ ధరించాలి.
- డీహైడ్రేట్ కాకుండా ఉండటానికి ఓఆర్ఎస్ (ఓరల్ రీహైడ్రేషన్ సొల్యూషన్), ఇంట్లో తయారుచేసిన లస్సీ, నిమ్మకాయ నీరు, మజ్జిగ, కొబ్బరి నీరు తాగాలి. మంచినీరు ఎక్కువగా తీసుకోవాలి



# నలుగురు కార్మికులు మృతి


**మొదటి పేజీ తరువాయి**

కుప్పకూలడంతో ఘటనా స్థలంలోనే ముగ్గురు చనిపోయారు. ఆసుపత్రికి తరలిస్తుండగా ఒకరు మృతి చెందారు. ప్రమాదంలోని బాధితులంతా ఇతర రాష్ట్రాలకు చెందిన వారని తెలుస్తోంది. నాణ్యతా ప్రమాణాలు పాటించకుండా భవనం నిర్మిస్తుండటమే ఈ ప్రమాదానికి కారణమనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రమాదం గురించి తెలియగానే పోలీసులు, రెవెన్యూ, రెస్క్యూ సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుంది. ఘటనా స్థలంలో సహాయక చర్యలు చేపట్టారు. బిల్డర్ పరారీలో ఉన్నట్లు తెలిసింది.

# మూడో బిడ్డను కంటే 25,000

**మొదటి పేజీ తరువాయి**

వెల్లడిస్తూ.. మూడో బిడ్డకు ఐదేళ్ల వయసు వచ్చేవరకు నెలకు రూ. 1,000 చొప్పున పౌష్టికాహార సాయం, 18 ఏళ్ల వరకు ఉచిత విద్యను అందించనున్నట్లు తెలిపారు. పిల్లలు కనేవారిని ప్రోత్సహించేందుకు తల్లికి 12 నెలలు, తండ్రికి 2 నెలల పాటు సెలవులు మంజూరు చేసే యోచనలో ఉన్నట్లు చెప్పారు. ప్రస్తుతం రాష్ట్రంలో సంతానోత్పత్తి రేటు (టీఎఫ్ఆర్) 1.5కు పడిపోయిందని, ఇది ఇలాగే కొనసాగితే జపాన్, ఇటలీ మాదిరిగా వృద్ధుల జనాభా పెరిగి, యువత సంఖ్య తగ్గే ప్రమాదం ఉందని సీఎం ఆందోళన వ్యక్తం చేశారు. జనాభా సమతుల్యత కోసం టీఎఫ్ఆర్ రేటును 2.1కి పెంచడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. గతంలో ఫ్యామిలీ ప్లానింగ్ (కుటుంబ నియంత్రణ) నినాదం ఉండేదని, ఇప్పుడు మారుతున్న కాలానికి అనుగుణంగా 'పాపులేషన్ కేర్' (జనాభా సంరక్షణ) విధానానికి మారుతున్నామని చంద్రబాబు పేర్కొన్నారు. స్థానిక సంస్థల ఎన్నికల్లో పోటీకి ఇద్దరు పిల్లల నిబంధనను ఇప్పటికే కూటమి ప్రభుత్వం తొలగించిందని గుర్తుచేశారు. మాతృత్వ, శక్తి, క్షేమ, నైపుణ్యం, సంజీవని అనే ఐదు దశల విధానంతో ప్రజలకు అండగా ఉంటామన్నారు. పిల్లలు



లేనివారి కోసం ప్రభుత్వ ఆసుపత్రుల్లో పీపీపీ పద్ధతిలో ఐవీఎఫ్ సేవలు అందిస్తామని తెలిపారు. ఈ పాలసీపై నెల రోజులు చర్చించి, మార్చి నెలాఖరుకు ఖరారు చేసి, ఏప్రిల్ 1 నుంచి అమలు చేస్తామని సీఎం ప్రకటించారు.



# కవిత నోట 'జై ఆంధ్ర'

**తిరుమల శ్రీవారి దర్శనానికి జాగృతి అధ్యక్షురాలు**
**రేణిగుంట విమానాశ్రయంలో జై ఆంధ్ర అంటూ నినాదం**
**తన పార్టీకి స్వామి ఆశీస్సులు ఉన్నాయని వ్యాఖ్య**

రేణిగుంట-తిరుపతి, మార్చి 5 (ఈవార్తలు): తెలంగాణ రాజకీయాల్లో తనకంటూ ఒక నూతన ప్రస్థానాన్ని ప్రారంభించేందుకు సిద్ధమవుతున్న కల్వకుంట్ల కవిత తిరుపతి పర్యటనలో చేసిన వ్యాఖ్యలు ఇప్పుడు రెండు రాష్ట్రాల్లోనూ చర్చనీయాంశంగా మారాయి. కొత్త పార్టీని ప్రకటించబోతున్నట్లు ఇప్పటికే సంకేతాలిచ్చిన ఆమె... తిరుమల శ్రీవారి మొక్కు తీర్చుకోవడానికి కుటుంబ సభ్యులు, జాగృతి నాయకులతో కలిసి తిరుపతికి చేరుకున్నారు. రేణిగుంట విమానాశ్రయంలో మీడియా ప్రతినిధులతో మాట్లాడుతున్న సమయంలో ఆమె 'జై ఆంధ్ర' అని నినాదం చేయడం అందరినీ ఆశ్చర్యపరిచింది. తన రాక సందర్భంగా ఏపీలోని శ్రేయోభిలాషులు, అభిమానులు పెద్ద ఎత్తున తరలివచ్చి స్వాగతం పలికారని కృతజ్ఞతలు తెలియజేశారు. త్వరలో తాము ప్రారంభించబోతున్న రాజకీయ పార్టీకి శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆశీస్సులు ఉంటాయని నమ్ముతున్నానని అన్నారు. మరోవైపు, తనను ఇబ్బంది పెట్టిన కేసుల నుంచి కోర్టు క్లీన్ చిట్ ఇవ్వడంపై కవిత హర్షం వ్యక్తం చేశారు. సత్యం తన వైపు ఉన్నందునే దైవకృపతో కేసుల నుంచి విముక్తి లభించిందని, ఆ మొక్కు తీర్చుకునేందుకే అలిపిరి నుంచి కాలినడకన తిరుమలకు వెళుతున్నట్లు వివరించారు. ఈ సందర్భంగా తాను స్థాపించబోయే కొత్త రాజకీయ పార్టీకి శ్రీవారి ఆశీస్సులు ఉంటాయని ఆమె విశ్వాసం వ్యక్తం చేశారు. తెలంగాణ అస్తిత్వం ప్రాతిపదికగా తన రాజకీయ ప్రయాణం ఉంటుందని చెబుతున్న కవిత, ఏపీలో 'జై ఆంధ్ర' అనడం వెనుక వ్యూహాత్మక కారణాలు ఏమైనా ఉన్నాయా అనే చర్చ రాజకీయ వర్గాల్లో మొదలైంది. ముఖ్యంగా హైదరాబాద్‌తో పాటు తెలంగాణలోని ఇతర ప్రాంతాల్లో నివసిస్తున్న ఏపీ సెటిలర్ల ఓట్లు ఏ ఎన్నికల్లోనైనా కీలకంగా మారుతుంటాయి. ఈ నేపథ్యంలో, వారిని ఆకట్టుకోవడానికి కవిత ఈ నినాదాన్ని వాడుకున్నారా? అనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రస్తుతం ఆమె కుటుంబ సభ్యులతో కలిసి అలిపిరి మెట్ల మార్గం ద్వారా తిరుమలకు వెళుతున్నారు. శుక్రవారం ఉదయం స్వామివారిని దర్శించుకోనున్నారు. ఈ పర్యటన ముగిసిన వెంటనే తన కొత్త పార్టీ పేరు మరియు విధివిధానాలను అధికారికంగా ప్రకటించే అవకాశం ఉంది.



# రాజ్యసభకు సింఘ్వీ, వేం నామినేషన్

**మొదటి పేజీ తరువాయి**

ఎత్తున అసెంబ్లీ ప్రాంగణానికి చేరుకున్నారు. తెలంగాణ తరఫున రాజ్యసభకు రెండోసారి వెళ్లడం అదృష్టంగా భావిస్తున్నట్లు అభిషేక్ సింఘ్వీ తెలిపారు. కాంగ్రెస్ అధ్యక్షుడు ఖర్గే, అగ్రనేతలు సోనియా, రాహుల్, కేసీ వేణుగోపాల్‌కు ఆయన ధన్యవాదాలు తెలిపారు. రాజ్యసభ అభ్యర్థిగా అవకాశం కల్పించిన అధిష్ఠానానికి కృతజ్ఞతలు తెలుపుతున్నట్లు వేం నరేందర్‌రెడ్డి చెప్పారు. ప్రస్తుతం సిటింగ్ ఎంపీగా ఉన్న అభిషేక్ మను సింఘ్వీ పేరును కాంగ్రెస్ ఎంపిక చేయగా ఆయన బుధవారం సాయంత్రమే హైదరాబాద్ వచ్చారు. రెండో స్థానానికి అభ్యర్థి ఎవరనే దానిపై రాత్రి వరకు చర్చలు, సంప్రదింపుల తర్వాత వేం నరేందర్‌రెడ్డి పేరును ఖరారు చేశారు. ఈయనకు రాజ్యసభ అభ్యర్థిత్వం ఖరారు చేయాలని సీఎం రేవంత్‌రెడ్డి గట్టిగా కోరడంతో అధిష్ఠానం సీఎం మాటకే ప్రాధాన్యం ఇచ్చింది. ఒకవేళ బీఆర్ఎస్ తన అభ్యర్థిని రంగంలోకి దింపితే రెండో స్థానానికి పోటీ అనివార్యమవుతుంది. ఆ పార్టీ పోటీలో లేకుంటే రెండు స్థానాలను కాంగ్రెస్ ఏకగ్రీవంగా దక్కించుకుంటుంది. మొదటి స్థానానికి అభిషేక్ సింఘ్వీ ఎన్నికకు ఎలాంటి సమస్య లేదు. రెండో స్థానానికి అవసరమైన మెజార్టీ కాంగ్రెస్‌కు లేదు. ఎంఐఎంపై ఆధారపడాల్సి ఉంటుంది. పోటీ లేకుంటే ఎన్నిక ఏకగ్రీవమవుతుంది.

## తెలంగాణ గవర్నర్‌గా శివ ప్రతాప్ శుక్లా

**మొదటి పేజీ తరువాయి**

తరంజిత్ సింగ్ సంధును ఎంపిక చేయగా.. నాగాలాండ్ గవర్నర్‌గా నంద్ కిషోర్ యాదవ్ నియమితులయ్యారు. బీహార్ గవర్నర్‌గా లెఫ్టినెంట్ జనరల్ (రిటైర్డ్) సయ్యద్ అతా హస్నైన్ నియమించారు. పశ్చిమ బెంగాల్ గవర్నర్‌గా తమిళనాడు గవర్నర్ ఆర్ఎన్ రవిని బదిలీ చేశారు. తమిళనాడు గవర్నర్‌గా కేరళ గవర్నర్ రాజేంద్ర విశ్వనాథ్ అర్లేకర్‌ను నియమించగా, హిమాచల్ ప్రదేశ్ గవర్నర్‌గా లడఖ్ లెఫ్టినెంట్ గవర్నర్ కవిందర్ గుప్తా నియమితులయ్యారు.

# గ్రామాలకు కేంద్రం 1,034 కోట్లు

## రాష్ట్రంలోని పంచాయతీలకు ప్రయోజనం.. కేంద్రమంత్రి కిషన్ రెడ్డి వెల్లడి

హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): గ్రామీణ స్థానిక సంస్థలకు ఆర్థిక సంఘం కేటాయింపుల కింద 2026లో తెలంగాణకు ఇప్పటివరకు రూ. 1,034.42 కోట్ల నిధులు అందజేశారని, ఈ నిధులతో రాష్ట్రంలోని 12,702 గ్రామ పంచాయతీలకు పెద్దఎత్తున ప్రయోజనం చేకూరుతుందని కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి తెలిపారు. గురువారం తెలంగాణ గ్రామ పంచాయతీలకు మొదటి విడతగా రూ. 259.36 కోట్లు, ఆ తర్వాత రెండవ విడతగా రూ. 387.1 కోట్లు విడుదల అయ్యాయని ఆయన పేర్కొన్నారు. ఈ మేరకు కిషన్ రెడ్డి ఓ ప్రకటన విడుదల చేశారు. 2025-26 ఆర్థిక సంవత్సరానికి సంబంధించిన 15వ ఆర్థిక సంఘం నిధులలో మూడవ విడత నిధులను కేంద్ర ప్రభుత్వం ఇటీవలే విడుదల చేసిందని, దీని ద్వారా తెలంగాణకు రూ. 387.96 కోట్ల నిధులు విడుదలయ్యాయన్నారు. రాష్ట్రంలో గ్రామ పంచాయతీ ఎన్నికలు పూర్తయిన తర్వాత ఇటీవలే ఈ నిధులు విడుదల అయ్యాయని, ఈ నిధులకు సంబంధించిన ఖర్చులకు వినియోగ ధృవీకరణ పత్రాలు (యుటిలైజేషన్ సర్టిఫికెట్స్) కేంద్రానికి సమర్పించిన తర్వాత మిగిలిన రూ. 2000 కోట్ల నిధులు కూడా వెంటనే విడుదల అవుతాయని కిషన్ రెడ్డి చెప్పారు. కేంద్రం తెలంగాణ రాష్ట్రంలోని గ్రామ పంచాయతీలు మరియు స్థానిక సంస్థలకు రూ. 11,000 కోట్లకు పైగా నిధులను విడుదల చేసిందని, 2015--16 నుండి 2019--20 వరకు రూ. 5,060 కోట్లు విడుదల చేయగా, 2020--21 నుండి 2025--26 వరకు కేటాయింపులు 80 శాతం పెరిగి రూ. 9,050 కోట్లకు చేరుకున్నాయని ఆయన తెలిపారు. అందులో రూ. 6,051 కోట్ల నిధులు ఈ ఏడాది జనవరికి ముందే విడుదల అయ్యాయని కిషన్ రెడ్డి చెప్పారు. తెలంగాణ ఆర్థిక శాఖ ఈ నిధులను పది పని దినాలలోపు ఆయా గ్రామ పంచాయతీలకు బదిలీ చేయాల, ఆ పని దినాలకు మించి ఏదైనా ఆలస్యం జరిగితే, రాష్ట్ర ప్రభుత్వాలు ఇతర పథకాల కోసం తీసుకున్న మార్కెట్ రుణాలు/రాష్ట్ర అభివృద్ధి రుణాలపై చెల్లిస్తున్న వడ్డీ రేటు ప్రకారం, గ్రామ పంచాయతీలకు కూడా వడ్డీతో కలిపి కేంద్ర నిధులను విడుదల చేయాల్సి ఉంటుందని కిషన్ రెడ్డి చెప్పారు. ప్రతి గ్రామ పంచాయతీ నిధుల వినియోగం కోసం ప్రత్యేక బ్యాంకు ఖాతాను నిర్వహించాలి, దీన్ని పీఎఫ్ఎంఎస్ పోర్టల్‌లో ఒక ప్రత్యేకమైన ఏజెన్సీ కోడ్‌తో నమోదు చేసి పారదర్శకతతో నిధుల బదిలీ, ఖర్చు, యుటిలైజేషన్ సర్టిఫికెట్స్ సమర్పించాల్సి ఉంటుందని కిషన్ రెడ్డి చెప్పారు. గత బీఆర్ఎస్



ప్రభుత్వం గ్రామ పంచాయతీ బ్యాంకు ఖాతాలను అటాచ్ చేసి, కేంద్రం విడుదల చేసిన నిధులను ఇతర కార్యక్రమాల కోసం మళ్లించి గ్రామాలకు అన్యాయం చేసిందని, దీనితో అనేక మంది సర్పంచ్‌లు తమ పదవీకాలంలో అమలు చేసిన పనులకు నిధులు అందకపోవడంతో రాజీనామా చేశారు. కొన్ని చోట్ల, సర్పంచ్‌లు ఆత్మహత్యలకు కూడా పాల్పడిన విషయం తెలంగాణ ప్రజలకు తెలిసిందే అని కిషన్ రెడ్డి వెల్లడించారు. కేంద్ర ప్రభుత్వం పంచాయతీ రాజ్ సంస్థలు/గ్రామీణ స్థానిక సంస్థలకు 14వ ఆర్థిక సంఘం నిధులు రూ. 5,060 కోట్లు విడుదల చేసిందని కిషన్ రెడ్డి చెప్పారు. 15వ ఆర్థిక సంఘం తెలంగాణకు రూ. 9,050 కోట్లు నిధులను కేటాయించిందన్నారు. రెండు ఆర్థిక సంఘాల కింద కలిపి రూ. 14,110 కోట్లను తెలంగాణకు కేటాయించిందని ఆయన చెప్పారు. 14 వ ఆర్థిక సంఘం లో రూ. 5,060 కోట్లు, 15వ ఆర్థిక సంఘం లో రూ. 6,051 కోట్లతో కలిపి రూ. 11,111 కోట్లు డిసెంబర్ 31, 2025 నాటికి విడుదల అయ్యాయన్నారు.

## జిమ్‌లో వ్యాయామం చేస్తూ టెక్కీ హఠాన్మరణం

జూబ్లీహిల్స్–హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): హైదరాబాద్ నగరంలో విషాదకర ఘటన వెలుగుచూసింది. ఈ మధ్యకాలంలో వ్యాయామం చేస్తూ, లేదా ఆడుతూ ఆకస్మిక గుండెపోటుతో మరణిస్తున్న వారి సంఖ్య ఆందోళన కలిగిస్తోంది. తాజాగా జూబ్లీహిల్స్‌లో ఓ సాఫ్ట్‌వేర్ ఉద్యోగి జిమ్‌లో వర్కవుట్ చేస్తూ ప్రాణాలు కోల్పోయాడు. మృతుడిని నాగండ్ల అనిల్ చౌదరి (36)గా గుర్తించారు. వివరాల్లోకి వెళ్తే.. జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 36లో ఉన్న ఏసిబో జిమ్‌కు అనిల్ చౌదరి నిత్యం వ్యాయామం కోసం వెళుతుండేవాడు. ఎప్పటిలాగే అతడు జిమ్‌కు వచ్చి, కాసేపు వ్యాయామం చేసిన అనంతరం వాష్‌రూమ్‌కు వెళ్లాడు. అయితే అక్కడ ఒక్కసారిగా స్పృహతప్పి కుప్పకూలిపోయాడు. దీనిని గమనించిన జిమ్ నిర్వాహకులు, ఇతరులు వెంటనే స్పందించి అనిల్ చౌదరికి సీపీఆర్ చేసే ప్రయత్నం చేశారు. అయినప్పటికీ అతనిలో ఎటువంటి చలనం లేకపోవడంతో.. హుటాహుటీన సమీపంలోని ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తరలించారు. అక్కడ అనిల్‌ను పరీక్షించిన వైద్యులు.. అప్పటికే అతను గుండెపోటుతో మృతి చెందినట్లు నిర్ధారించారు. 36 ఏళ్ల చిన్నవయసులోనే సాఫ్ట్‌వేర్ ఉద్యోగి గుండెపోటుతో మరణించడంతో అతని కుటుంబంలో తీవ్ర విషాదం నెలకొంది.

## లంచం తీసుకుంటూ పట్టుబడ్డ జీహెచ్ఎంసీ ఆఫీసర్

సికింద్రాబాద్, మార్చి 5 (ఈవార్తలు): జీహెచ్ఎంసీ అధికారి ఒకరు ఏసీబీకి చిక్కారు. సికింద్రాబాద్ జోనల్ కార్యాలయంలోని అకౌంట్స్ విభాగంలో ఎగ్జామినర్‌గా పనిచేస్తున్న సూర్యవంశీ సంతోష్ రూ. 35 వేలు లంచం తీసుకుంటూ అవినీతి నిరోధక శాఖ అధికారులకు పట్టుబడ్డారు. పదవీ విరమణ చేసిన ఉద్యోగి పెన్షన్ ప్రాసెస్ చేయడానికి గాను సంతోష్ రూ. 40 వేలు లంచం డిమాండ్ చేశారు. దీంతో బాధితుడు ఏసీబీని ఆశ్రయించాడు. ఈ క్రమంలో కార్యాలయంలో రూ. 35,000 తీసుకుంటుండగా అధికారులు రెడ్ హ్యాండెడ్‌గా పట్టుకున్నారు. ఈ సందర్భంగా ఏసీబీ ప్రజలకు సూచన జారీ చేసింది. ఒకవేళ ఏ ప్రభుత్వ సేవకుడైనా లంచం అడిగినట్లయితే అవినీతి నిరోధక శాఖ టోల్ ఫ్రీ నెంబర్ 1064 కు ఫోన్ చేసి సమాచారం అందించవచ్చని తెలిపింది.

## పుదుచ్చేరి ఎన్నికల అబ్జర్వర్‌గా పొన్నం

హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): మంత్రి పొన్నం ప్రభాకర్‌కు కాంగ్రెస్ హైకమాండ్ కీలక బాధ్యతలు అప్పగించింది. పుదుచ్చేరి అసెంబ్లీ ఎన్నికల ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమించింది. పొన్నం ప్రభాకర్‌తో పాటు కర్ణాటక హెల్త్ మినిస్టర్ దినేష్ గుండు రావును కూడా ప్రత్యేక అబ్జర్వర్‌గా నియమించింది. ఈ మేరకు ఏఐసీసీ జనరల్ సెక్రటరీ కేసీ వేణుగోపాల్ ప్రకటన విడుదల చేశారు. పుదుచ్చేరి కేంద్రపాలిత ప్రాంతం. ఇది నాలుగు జిల్లాలను కలిగి ఉంది. పుదుచ్చేరి, కారైకల్, మాహె, యానాం. 30 శాసనసభ నియోజకవర్గ స్థానాలు ఉన్నాయి. మరోవైపు.. పుదుచ్చేరి రాజకీయాల్లో ఇప్పుడు ఎన్నికల వేడి తారాస్థాయికి చేరింది. 2026 అసెంబ్లీ ఎన్నికల కోసం కేంద్రపాలిత ప్రాంతమైన పుదుచ్చేరిలో ప్రధాన పార్టీల మధ్య ముక్కోణపు పోరు స్పష్టంగా కనిపిస్తోంది. ఈ ఎన్నికల్లో కాంగ్రెస్, డీఎంకే కలిసి పోటీ చేయబోతున్నాయి. తమిళనాడు తరహాలో ఇక్కడ కూడా తమ

# పుష్కరాల కోసం కేబినెట్ సబ్ కమిటీ

**కమిటీ చైర్మన్‌గా మంత్రి శ్రీధర్ బాబు**

**కన్వీనర్‌గా దేవాదాయశాఖ ముఖ్య కార్యదర్శి**

**2027 జూలై 23 నుంచి గోదావరి పుష్కరాలు**



హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): తెలంగాణలో ప్రతిష్ఠాత్మకంగా జరగనున్న గోదావరి పుష్కరాలకు (2027) ప్రభుత్వం ముందస్తు ఏర్పాట్లు ప్రారంభించింది. 'దక్షిణ కుంభమేళా'గా పిలిచే ఈ మహా క్రతువు నిర్వహణ, ఏర్పాట్ల పర్యవేక్షణ కోసం రాష్ట్ర ప్రభుత్వం తొమ్మిది మంది సభ్యులతో కూడిన కేబినెట్ సబ్ కమిటీని ఏర్పాటు చేసింది. ఈ మేరకు ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.రామకృష్ణారావు ఉత్తర్వులు జారీ చేశారు. ఈ కమిటీకి ఐటీ, పరిశ్రమల శాఖ మంత్రి దుద్దిళ్ల శ్రీధర్ బాబు చైర్మన్‌గా వ్యవహరిస్తారు. కమిటీ సభ్యులుగా మంత్రులు కోమటిరెడ్డి వెంకటరెడ్డి, పొంగులేటి శ్రీనివాస్ రెడ్డి, పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ, సీతక్క, తుమ్మల నాగేశ్వరరావు, ప్రభుత్వ విప్ అడ్లూరి లక్ష్మణ్ కుమార్, పి.సుదర్శన్ రెడ్డిలను నియమించారు. దేవాదాయ శాఖ ముఖ్య కార్యదర్శి ఈ కమిటీకి కన్వీనర్‌గా వ్యవహరిస్తారు. అవసరాన్ని బట్టి గోదావరి తీర ప్రాంతాల ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలను ప్రత్యేక ఆహ్వానితులుగా సమావేశాలకు పిలవనున్నారు. త్వరలోనే కమిటీ సమావేశమై సిఫార్సులను అందజేయనుంది. 2027 జూలై 23న గోదావరి పుష్కరాలు ప్రారంభం కానున్న నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి ఇప్పటికే అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. ఈసారి వచ్చే భక్తుల రద్దీని దృష్టిలో ఉంచుకుని కేంద్రం నుంచి ప్రత్యేక ప్యాకేజీ కోరాలని ప్రభుత్వం నిర్ణయించింది. రాష్ట్రంలో సుమారు 560 కిలోమీటర్ల మేర గోదావరి ప్రవహిస్తుండటంతో దాదాపు 74 ఘాట్ల ఏర్పాటుకు ప్రతిపాదనలు ఉన్నాయి. ముఖ్యంగా బాసర, కాళేశ్వరం, ధర్మపురి, భద్రాచలం ఆలయాల వద్ద రద్దీ ఎక్కువగా ఉండే అవకాశం ఉండటంతో అక్కడ ప్రాధాన్యత ఇవ్వాలని సీఎం సూచించారు. పుష్కరాల ఏర్పాట్లు తాత్కాలికంగా కాకుండా, శాశ్వత ప్రాతిపదికన ఉండాలని సీఎం స్పష్టం చేశారు. ఆలయాల అభివృద్ధి, పర్మనెంట్ పుష్కర ఘాట్లు, రోడ్లు, వసతి సముదాయాలు నిర్మించాలని ఆదేశించారు. రోజుకు రెండు లక్షల మంది భక్తులు వచ్చినా ఇబ్బంది లేకుండా ట్రాఫిక్, పార్కింగ్, మంచినీటి సౌకర్యాలు కల్పించాలని అధికారులకు దిశానిర్దేశం చేశారు.

# ఏటూరునాగారం గురుకులంలో ఫుడ్ పాయిజన్

**ఆరుగురు విద్యార్థినులకు అస్వస్థత**



ములుగు, మార్చి 5 (ఈవార్తలు): ములుగు జిల్లా ఏటూరునాగారం మండల కేంద్రంలోని గిరిజన సంక్షేమ గురుకుల బాలికల జూనియర్ కళాశాలలో విషాదకర సంఘటన చోటుచేసుకుంది. కళాశాల వసతి గృహంలో అందించిన ఆహారం వికటించడంతో పలువురు విద్యార్థినులు తీవ్ర అస్వస్థతకు గురయ్యారు. బుధవారం రాత్రి భోజనం చేసిన తర్వాత విద్యార్థినులకు వరుసగా వాంతులు, విరేచనాలు కావడంతో హాస్టల్ ప్రాంగణంలో ఒక్కసారిగా కలకలం రేగింది. బాధిత విద్యార్థినుల పరిస్థితిని గమనించిన కళాశాల సిబ్బంది వెంటనే స్పందించి, వారిని చికిత్స నిమిత్తం స్థానిక ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. ప్రస్తుతం ఆరుగురు విద్యార్థినులు ఆసుపత్రిలో చికిత్స పొందుతుండగా, వారి ఆరోగ్య పరిస్థితి ప్రస్తుతం నిలకడగానే ఉందని వైద్యులు వెల్లడించారు. మెరుగైన వైద్యం అందిస్తున్నామని, ఎవరూ ఆందోళన చెందాల్సిన పనిలేదని వైద్య బృందం స్పష్టం చేయడంతో తల్లిదండ్రులు కొంత ఊపిరి పీల్చుకున్నారు. తెలంగాణ రాష్ట్రంలోని పలు ప్రభుత్వ వసతి గృహాల్లో ఇలాంటి ఫుడ్ పాయిజన్ ఘటనలు పునరావృతం కావడం ఇప్పుడు సర్వత్రా ఆందోళన కలిగిస్తోంది. నాణ్యత లేని బియ్యం, అపరిశుభ్రమైన వాతావరణంలో వంటలు చేయడం వల్లే తమ పిల్లలు అనారోగ్యం పాలవుతున్నారని విద్యార్థుల తల్లిదండ్రులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అధికారుల పర్యవేక్షణ లోపం వల్లే పదేపదే ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని స్థానికులు విమర్శిస్తున్నారు. ఈ ఘటనపై విద్యాశాఖ, గిరిజన సంక్షేమ శాఖ అధికారులు విచారణకు ఆదేశించారు. ఆహార నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపినట్లు సమాచారం. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు జరగకుండా వంటశాలల్లో పరిశుభ్రతను పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించడంలో నిర్లక్ష్యం వహించే సిబ్బందిపై కఠిన చర్యలు తీసుకోవాలని విద్యార్థి సంఘాలు డిమాండ్ చేస్తున్నాయి.

## ఫిరాయింపు ఎమ్మెల్యేల కేసు విచారణలో మళ్ళీ ట్విస్ట్



హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు విషయం మళ్లీ ట్విస్ట్ చోటు చేసుకుంది. ఈ అనర్హత కేసు విచారణలో భాగంగా దానం నాగేందర్‌పై విచారణ పూర్తి కాలేదు. దానం నాగేందర్‌పై విచారణను శనివారానికి వాయిదా వేశారు స్పీకర్ గడ్డం ప్రసాద్. మరొకవైపు కడియం శ్రీహరి విచారణ పూర్తి చేశారు స్పీకర్. శనివారం మధ్యాహ్నం 2.30 గంటలకు విచారణకు హాజరు కావాలని ఇరు వర్గాలకు సూచించారు స్పీకర్. దానంపై దాఖలైన రెండు పిటిషన్లను శనివారం విచారించనున్నారు. గత నెలలో తెలంగాణలో బీఆర్ఎస్ పార్టీ ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు విషయంపై సుప్రీంకోర్టు ఆగ్రహం వ్యక్తం చేసిన సంగతి తెలిసిందే.. మూడు వారాల్లో నిర్ణయం తీసుకోకపోతే కోర్టు ధిక్కరణ చర్యలు చేపడతామని ఫిబ్రవరి 6వ తేదీన హెచ్చరించింది. ఈ క్రమంలోనే తెలంగాణ స్పీకర్ గడ్డం ప్రసాద్‌కు మరో అవకాశం ఇచ్చింది. అనర్హత అంశాన్ని తేల్చాలని ఇప్పటికే స్పీకర్‌కు చాలా సమయం ఇచ్చామని వ్యాఖ్యానించిన ధర్మాసనం.. అనర్హత పిటిషన్లపై విచారణ పూర్తిచేసి కోర్టుకు నివేదిక సమర్పించాలని స్పీకర్‌ను ఆదేశించింది. ఈ క్రమంలోనే స్పీకర్ గడ్డం ప్రసాద్.. ఫిరాయింపు ఎమ్మెల్యేల అనర్హత కేసు విచారణను తేల్చేపనిలో పడ్డారు.

## విధ్వంసం అవసరమా?

**ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా మూసీ సుందరీకరణ సాధ్యం**

**బీఆర్ఎస్ హయాంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున చేశాం**

**రూ.16 వేల కోట్లకే సుందరీకరణ చేసి చూపిస్తామని సవాల్**



హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): విధ్వంసం చేయకుండా, ఎవరి ఇళ్లు కూల్చకుండా కూడా అభివృద్ధి, సుందరీకరణ పనులు చేయవచ్చని బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అన్నారు. బీఆర్ఎస్ అధికారంలో ఉన్నప్పుడు మూసీ పరివాహక ప్రాంతంలో ఐదున్నర కిలోమీటర్ల పొడవున సుందరీకరణ పనులు చేశామని గుర్తు చేశారు. ప్రజల ఆస్తులకు నష్టం చేయకుండా అభివృద్ధి చేయవచ్చని చెప్పడానికి ఇదే నిదర్శనమని అన్నారు. హైదరాబాద్ నగరంలోని నాగోల్‌లో సీవేజ్ ట్రీట్మెంట్ ప్లాంట్ (ఎస్టీపీ)ని ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, నగరంలో హైడ్రా పేరుతో కాంగ్రెస్ ప్రభుత్వం చేస్తున్న అరాచకాలకు అడ్డు అదుపు లేకుండా పోయిందని మండిపడ్డారు. పేదల ఇళ్లు కూల్చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. రూ. 1.50 లక్షల కోట్లతో మూసీ సుందరీకరణ పనులు చేస్తామని ముఖ్యమంత్రి చెబుతున్నారని, కానీ రూ. 16 వేల కోట్లతోనే ఆ పనులు చేయవచ్చని అన్నారు. మూసీ సుందరీకరణ పనులను తమకు అప్పగిస్తే రూ. 16 వేల కోట్లకే చేసి చూపిస్తామని అన్నారు. పైగా ఒక్క ఇల్లు కూడా కూల్చకుండా అభివృద్ధి చేస్తామని అన్నారు. హామీల అమలు కోసమే కాంగ్రెస్ పార్టీకి ప్రజలు పట్టం కట్టారని అన్నారు. ఈ రెండున్నరేళ్ల కాలంలో కాంగ్రెస్ పార్టీ ఒక్క ఇంటిని నిర్మించినట్లు నిరూపిస్తే రాజకీయాల నుంచి తప్పుకుంటానని సవాల్ చేశారు.



## నథింగ్ 4ఏ, 4ఏ ప్రో విడుదల

ప్రముఖ మొబైల్ కంపెనీ నథింగ్ రెండు స్మార్ట్ ఫోన్లను దేశీయ మార్కెట్‌లోకి విడుదల చేసింది. నథింగ్ ఫోన్ 4ఏ, నథింగ్ ఫోన్ 4ఏ ప్రో పేరిట వీటిని లాంచ్ చేసింది. ఆకర్షణీయమైన డిజైన్, ఫీచర్లతో వీటిని తీసుకొచ్చింది. లండన్ వేదికగా జరిగిన కార్యక్రమంలో కంపెనీ సీఈఓ కార్ల్ పై ఈ ఫోన్ల విశేషాలను పంచుకున్నారు. నథింగ్ 3ఏ ఫోన్ మాదిరిగానే 4ఏ సిరీస్‌లోనూ ఫోన్ వెనుక భాగంలో గ్లిఫ్ మాట్రిక్స్‌ను తీసుకొచ్చారు. 3ఏ సిరీస్ కంటే 40% ఎక్కువ బ్రైట్‌నెస్ 4ఏలో అందిస్తున్నారు. ఫోన్లతో పాటు నథింగ్ హెడ్‌ఫోన్లను కూడా కంపెనీ లాంచ్ చేసింది.

**నథింగ్ 4ఏ వివరాలు**

నథింగ్ ఫోన్ 4ఏలో స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్‌ను అమర్చారు. 6.78 అంగుళాలతో 1.5కే ఎల్టీపీఎస్ ఫిక్సబుల్ అమోలెడ్ డిస్‌ప్లే అమర్చారు. ఇది 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్‌తో పనిచేస్తుంది. 4,500 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్ ఇచ్చారు. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్ ఉంది. గ్లిఫ్ మాట్రిక్స్, మెటల్ బాడీ ఇచ్చారు. ఫోన్ వెనుక భాగంలో మూడు రంగులతో డిజైన్ చేశారు. ఎల్పీడీడీఆర్4 ర్యామ్, యూఎఫ్ఎస్ 3.1 స్టోరేజీతో తీసుకొచ్చారు. 50ఎంపీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ పెరిస్కోపిక్ లెన్స్, 8 ఎంపీ అల్ట్రా వైడ్ యాంగిల్ కెమెరా ఉంది. సెల్ఫీల కోసం 32 ఎంపీ కెమెరా అమర్చారు. 50 వాట్ ఫాస్ట్ వైర్డ్ ఛార్జింగ్ సదుపాయంతో కూడిన 5,400మాహ్ బ్యాటరీని ఇచ్చారు. మూడు వేరియంట్లలో ఈ ఫోన్ లభిస్తుంది. 8ం128 జీబీ వేరియంట్ ధర రూ. 31,999, 8జీబీ, 256 జీబీ ధర రూ. 34,999, 12 జీబీ, 256 జీబీ ధర రూ. 37,999 గా కంపెనీ నిర్ణయించింది. బ్యాంక్ ఆఫర్, ఎక్స్ఛేంజీ బోనస్ సదుపాయం కల్పిస్తోంది. 9 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐ సదుపాయం కూడా ఉంది. బ్లాక్, బ్లూ, పింక్, వైట్ రంగుల్లో లభిస్తుంది.

**నథింగ్ 4ఏ ప్రో**

నథింగ్ ఫోన్ 4ఏ ప్రోలో గ్లిఫ్ మాట్రిక్స్ కాస్త పెద్దగా ఉంటుంది. 6.83 అంగుళాల 1.5కే అమోలెడ్ డిస్‌ప్లే, 120 హెచ్‌జెడ్ రిఫ్రెష్ రేట్, 5,000 నిట్స్ పీక్ బ్రైట్‌నెస్‌తో తీసుకొచ్చారు. కార్నింగ్ గొరిల్లా గ్లాస్ 7ఐ ప్రొటెక్షన్ ఉంది. ఐపీ65 రేటింగ్ ఉంది. 50 ఎంపీ సోనీ ప్రధాన కెమెరా, 50 ఎంపీ టెలిఫొటో లెన్స్, 8 ఎంపీ అల్ట్రావైడ్ యాంగిల్ కెమెరా, 32 ఎంపీ సెల్ఫీ కెమెరా ఇచ్చారు. స్నాప్‌డ్రాగన్ 7 జెన్ 4 ప్రాసెసర్ ఉంది. 8జీబీ, 128 జీబీ వేరియంట్ ధర రూ. 39,999, 8జీబీ, 256జీబీ ధర రూ. 42,999, 12జీబీ, 256జీబీ ధర రూ. 45,999గా నిర్ణయించింది. బ్యాంకు ఆఫర్లతో రూ. 4 వేల వరకు డిస్కౌంట్ పొందొచ్చు. 12 నెలల వరకు నో కాస్ట్ ఈఎంఐ సదుపాయాన్ని కంపెనీ కల్పిస్తోంది. ఈ రెండు ఫోన్లకు 3 ఏళ్ల పాటు ఓఎస్ అప్‌డేట్స్, ఆరేళ్ల సెక్యూరిటీ అప్‌డేట్స్ ఇవ్వనున్నట్లు కంపెనీ పేర్కొంది. నథింగ్ 4ఏ మార్చి 13 నుంచి, నథింగ్ 4ఏ ప్రో అమ్మకాలు మార్చి 27 నుంచి ఫ్లిప్‌కార్ట్‌లో ప్రారంభం కానున్నాయి.

## నిజామాబాద్ జిల్లాలోకి పులి ఎంట్రీ

నిజామాబాద్, మార్చి 5 (ఈవార్తలు): జగిత్యాల, సిరిసిల్ల జిల్లాల నుంచి నిజామాబాద్ జిల్లాలోకి వచ్చిన పెద్ద పులి ప్రస్తుతం కమ్మర్‌పల్లి రేంజ్ పరిధిలోని గట్టుపొడిచినవాగు ప్రాజెక్టు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో సేదతీరుతోంది. గురువారం తెల్లవారుజామున అటవీ శాఖ అమర్చిన ట్రాప్ కెమెరాకు పెద్ద పులి కదలికలు చిక్కడంతో కచ్చితంగా నిర్ధారణ అయింది. మహారాష్ట్రలోని తడోబా అడవి నుంచి వచ్చిన ఈ పులి కొన్ని నెలలుగా ఆదిలాబాద్, జగిత్యాల, సిరిసిల్ల, సిద్దిపేట, యాదాద్రి భువనగిరి తదితర జిల్లాల్లో సంచరిస్తోంది. మూడు రోజుల క్రితం కమ్మర్‌పల్లి రేంజ్‌లోకి వచ్చిన ఈ పులి ఇదేచోట వన్యప్రాణిని చంపి తిని, ఇక్కడే దాహార్తిని తీర్చుకుని సేద తీరుతున్నట్లు తెలుస్తోంది. ఈ క్రమంలో పెద్ద పులి కదలికలపై పూర్తి స్థాయి సమాచారం కోసం అటవీ అధికారులు డ్రోన్ కెమెరాలతో నిఘా పెట్టారు. గట్టుపొడిచినవాగు బ్యాక్‌వాటర్ ప్రాంతంలో గురువారం అటవీ అధికారుల బృందం పెట్రోలింగ్ చేస్తున్న సందర్భంలో బీట్ అధికారి శ్రీదేవికి అలసట రావడంతో అక్కడే ఉన్న కల్వర్టు మీద కూర్చున్నారు. ఇది గమనించకుండా బృందంలోని మిగిలిన సభ్యులు కొంత ముందుకు వెళ్లారు. ఇదే సమయంలో వెనుక వైపు 30 మీటర్ల దూరంలో అలికిడి వినిపించడంతో శ్రీదేవి ఆవైపు చూడగా, పెద్ద పులి నడిచి వెళుతూ కనిపించింది. దీంతో ఆమె అక్కడికక్కడే మూర్ఛపోయారు. కల్వర్టుకు ఇవతలివైపు పడిపోయారు. అధికారుల బృందం తక్షణమే ఆమెను ఆస్పత్రికి తరలించారు. కల్వర్టుకు అవతలివైపు పడిపోయి ఉంటే పులికి ఆహారం అయ్యేదానినని శ్రీదేవి విలపిస్తుండటంతో అధికారులు సైతం భయాందోళనకు గురవుతున్నారు.

## విరోష్ జంటకు రేవంత్ శుభాకాంక్షలు

**విజయ్ ఇంటికి వెళ్లి ఆశీర్వదించిన సీఎం**



హైదరాబాద్, మార్చి 5 (ఈవార్తలు): విరోష్ జంటను తెలంగాణ సీఎం రేవంత్ రెడ్డి ఆశీర్వదించారు. హైదరాబాద్‌లోని విజయ్ దేవరకొండ ఇంటికి వెళ్లిన ముఖ్యమంత్రి నూతన దంపతులకు శుభాకాంక్షలు తెలిపారు. దీనికి సంబంధించిన ఫోటోలను విజయ్ దేవరకొండ ట్విటర్‌లో షేర్ చేశారు. తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి మా ఇంటికి వచ్చి ఆశీర్వదించడం మా హృదయాన్ని కదిలించిందని విజయ్ దేవరకొండ పోస్ట్ చేశారు. మాపై ఆయన చూపించే ప్రేమ, ఆప్యాయతకు కృతజ్ఞతలు చెబుతూ ట్వీట్ చేశారు. ఈ పోస్ట్ సోషల్ మీడియాలో వైరల్‌గా మారింది. కాగా.. టాలీవుడ్ లవ్ బర్డ్స్ విజయ్– రష్మిక గతనెల 26న వివాహ బంధంలోకి అడుగుపెట్టిన సంగతి తెలిసిందే. రాజస్థాన్‌లోని ఉదయ్‌పూర్‌లో వీరిద్దరి పెళ్లి వేడుక గ్రాండ్‌గా జరిగింది. ఈ పెళ్లి వేడుకలో అత్యంత సన్నిహితులు, బంధుమిత్రులు పాల్గొన్నారు. పెళ్లి తర్వాత ఈనెల 4వ తేదీన హైదరాబాద్‌లోని తాజ్ కృష్ణలో గ్రాండ్ రిసెప్షన్ నిర్వహించారు. ఈ రిసెప్షన్‌కు టాలీవుడ్, రాజకీయ ప్రముఖులు హాజరయ్యారు.

# నాన్న అని పిలవలేని బాల్యం



## గణపతి కుమారుడి భావోద్వేగం

ఒక విప్లవం వెనుక సిద్ధాంతాలు ఉంటాయి. ఒక ఉద్యమం వెనుక రాజకీయ లక్ష్యాలు ఉంటాయి. కానీ ఆ ఉద్యమాల నీడలో కొన్నిసార్లు మనిషి జీవితంలోని అత్యంత మృదువైన భావోద్వేగాలు.. కుటుంబం, తండ్రి, తల్లి, పిల్లల మధ్య బంధం.. నిశ్శబ్దంగా బలి అవుతాయి. మావోయిస్టు అగ్రనేత ముప్పాల లక్ష్మణరావు అలియాస్ గణపతి కుమారుడు ముప్పాల శ్రీనివాసరావు విడుదల చేసిన ఈ భావోద్వేగపూరిత సందేశం ఆ నిజాన్ని మరోసారి మన కళ్లముందు నిలబెడుతోంది. గణపతి కుమారుడు భావాలను యథాతథంగా ఆడియో ద్వారా విడుదల చేసిన ఈ ఆడియోలో వినిపించిన మాటలు ఒక రాజకీయ ప్రకటన కాదు. ఒక సిద్ధాంతపరమైన విమర్శ కాదు. అది ఒక కుమారుడి గుండెల్లో దశాబ్దాలుగా పేరుకుపోయిన నిశ్శబ్ద వేదనకు వచ్చిన స్వరం.

### విప్లవ నేత వెనుక కనిపించని కుటుంబ కథ

గణపతి అనే పేరు భారతదేశంలో మావోయిస్టు ఉద్యమానికి ప్రతీకగా నిలిచింది. అడవుల్లో దశాబ్దాల పాటు సాగిన ఆయుధ పోరాటంలో ఆయన ఒక ప్రధాన నాయకుడిగా ఎదిగారు. కానీ అదే సమయంలో ఒక కుటుంబం.. ముఖ్యంగా భార్య, కుమారుడు.. ఆయన లేకుండానే జీవితం సాగించాల్సి వచ్చింది. కుమారుడు చెప్పిన మాటల్లో ఒక బాధ స్పష్టంగా వినిపిస్తుంది.. "మనం కలిసి ఉంటే బహుశా 'నాన్న' అనే పదం లక్షల సార్లు పిలిచి ఉండేవాడిని.. కానీ ఊహ తెలిసిన తర్వాత ఇప్పుడు మొదటిసారి నాన్న అని సంబోధిస్తున్నాను." ఈ వాక్యం ఒక వ్యక్తిగత బాధ మాత్రమే కాదు. అది విప్లవ రాజకీయాల వెనుక దాగి ఉన్న మానవీయ ఖాళీని ప్రతిబింబిస్తుంది. ఒక నాయకుడి విజయాలు, ఆయన నిర్మించిన రాజకీయ సామ్రాజ్యం ఎంత గొప్పదైనా, తన కుమారుడికి తండ్రిగా ఉండలేకపోయిన వాస్తవం మాత్రం మారదు.



### తల్లి కన్నీళ్లలో పెరిగిన బాల్యం

ఈ సందేశంలో అత్యంత హృదయాన్ని కదిలించే అంశం తల్లి గురించి చెప్పిన మాటలు. గణపతి అడవుల్లో విప్లవ పోరాటం కొనసాగిస్తుండగా, ఆయన భార్య సమాజానికి ఎదురుపడలేక ఇంటి గడప దాటకుండా జీవించిందని కుమారుడు చెప్పడం ఒక తీవ్రమైన సామాజిక వాస్తవాన్ని వెలుగులోకి తెస్తుంది. తండ్రి లేకపోవడం వల్ల ఏర్పడిన ఖాళీని భర్తీ చేస్తూ, తన బాధను మరిచిపోయి కుమారుడిని పెంచిన తల్లి కథ వేలాది కుటుంబాల కథను గుర్తు చేస్తుంది. విప్లవం, ఉద్యమం, సిద్ధాంతం అనే పెద్ద పదాల వెనుక, ఒక మహిళ జీవితమంతా నిశ్శబ్దంగా కన్నీటితో నిండిపోవడం కూడా ఒక నిజమే.

### సిద్ధాంతాన్ని ప్రశ్నించని కుమారుడు

ఈ సందేశంలో మరో విశేషం ఏమిటంటే.. కుమారుడు తన తండ్రి ఎంచుకున్న మార్గాన్ని నేరుగా విమర్శించలేదు. "మీరు ఎంచుకున్న సిద్ధాంతాన్ని ప్రశ్నించడం లేదు" అని చెప్పడం ద్వారా ఆయన తన తండ్రి ఆత్మార్పణను గౌరవించినట్టే కనిపిస్తుంది. ఇది ఒక పరిపక్వతను చూపుతుంది. విప్లవ పోరాటం అంటే త్యాగాలు, ప్రాణనష్టాలు, కుటుంబాల నుండి దూరం.. ఇవన్నీ సహజమని ఆయన అంగీకరిస్తున్నాడు. అదే సమయంలో, ఆ త్యాగాల వెనుక మిగిలిపోయిన బాధను కూడా దాచిపెట్టలేదు.



#### మారుతున్న కాలం - మారుతున్న పోరాట రూపాలు

ఈ సందేశంలో ఒక కీలకమైన ఆలోచన కూడా ఉంది. ఒకప్పటి పరిస్థితులతో పోల్చితే ఇప్పుడు సమాజంలో చాలా మార్పులు వచ్చాయని కుమారుడు చెబుతున్నాడు. నేటి యువతలో ఉన్న అవగాహన, ప్రపంచంతో అనుసంధానం, కొత్త అవకాశాలు.. ఇవన్నీ కొత్త మార్గాలను సూచిస్తున్నాయని ఆయన భావిస్తున్నాడు. అడవుల్లో ఆయుధాలతో సాగిన పోరాటం కంటే, నేటి కాలంలో జ్ఞానం, అనుభవం, మార్గదర్శకత్వం ద్వారా సమాజాన్ని మార్చే అవకాశాలు ఎక్కువగా ఉన్నాయని ఆయన సూచిస్తున్నాడు. ఇది ఒక వ్యక్తిగత విజ్ఞప్తి మాత్రమే కాదు. అది ఒక తరం నుంచి మరో తరానికి వచ్చిన ఆలోచనా మార్పు.

#### ఒక లేఖ.. ఒక కాలపు ప్రతిబింబం

ఈ ఆడియో సందేశం ఒక కుమారుడు తన తండ్రికి రాసిన భావోద్వేగపూరిత లేఖలా అనిపిస్తుంది. కానీ అది అంతకంటే ఎక్కువ. అది మావోయిస్టు ఉద్యమం వంటి దీర్ఘకాలిక రాజకీయ పోరాటాల మానవీయ మూల్యాన్ని గుర్తు చేసే ఒక కదిలించే పత్రం. విప్లవాలు చరిత్రను మార్చవచ్చు. కానీ కొన్ని సందర్భాల్లో ఆ చరిత్ర మార్పు కోసం చెల్లించాల్సిన త్యాగం కుటుంబాలే అవుతాయి..

గణపతి కుమారుడి ఈ మాటలు ఒక వ్యక్తిగత కథ మాత్రమే కాదు. అది ఒక ఉద్యమం, ఒక తరం, ఒక కుటుంబం.. ఈ మూడింటి మధ్య ఉన్న సంక్లిష్టమైన సంబంధాన్ని మన ముందుంచే భావోద్వేగపూరిత సాక్ష్యం. చివరగా ఆయన చెప్పిన మాటలు ఒక ఆశను వ్యక్తం చేస్తాయి.. తన తండ్రి వంటి అనుభవం, విజ్ఞానం దేశ నిర్మాణానికి ఉపయోగపడితే ఒక కొత్త నవభారతం నిర్మాణం సాధ్యమవుతుందని. అది ఒక కుమారుడి అభిలాష మాత్రమే కాదు. ఒక విప్లవం తర్వాత వచ్చే శాంతి గురించి చెప్పే ఆశ కూడా.

- కాలగిరి శ్రీనివాస్ రెడ్డి, సీనియర్ జర్నలిస్ట్

---

## వృద్ధురాలి అనుమానాస్పద మృతి

మల్యాల, మార్చి 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా మల్యాల మండలంలో 80 ఏళ్ల గూడూరి రాజేశ్వరి ఇంట్లోంచి బయటకు వెళ్లి తిరిగి రాకపోవడంతో కుటుంబ సభ్యులు ఆందోళన చెందారు. గాలింపులో భాగంగా ఇంటి సమీపంలోని బావిలో ఆమె మృతదేహం లభ్యమైంది. రాజేశ్వరికి మతిస్థిమితం సరిగా లేదని కుటుంబ సభ్యులు తెలిపారు. మల్యాల ఎస్సై నరేశ్ కుమార్ దర్యాప్తు ప్రారంభించి, కేసు నమోదు చేశారు.



## కొండగట్టులో భక్తులకు మజ్జిగ పంపిణీ

మల్యాల, మార్చి 5 (ఈవార్తలు): జగిత్యాల జిల్లా కొండగట్టు శ్రీ ఆంజనేయస్వామి దేవస్థానంలో నూతనంగా ఇంఛార్జి ఈవోగా బాధ్యతలు చేపట్టిన ఈవో ఎల్ రమాదేవి వేసవి కాలంలో ఆలయానికి వచ్చే భక్తుల సౌకర్యార్థం మజ్జిగ పంపిణీ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈసందర్భంగా ఈవో మాట్లాడుతు దాతల సహకారంతో స్వామి వారిని దర్శించుకొనే భక్తులకు ఆలయంలో మజ్జిగ అందజేయనున్నట్లు తెలిపారు. అనంతరం ప్రధాన ఆలయం పరిసరాలు, ఆలయ కార్యాలయం, పారిశుభ్రత, విఐపీ పార్కింగ్, టికెట్ కౌంటర్లు, ముఖ్య బుకింగ్ కేంద్రాలు తదితర ప్రదేశాలను పరిశీలించారు. ఆలయ ఉద్యోగులతో మాట్లాడి భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. దేవాదాయ ధర్మాదాయ శాఖ నిర్వహించిన పరిచారిక పోస్టుల పరీక్షల్లో ఉత్తీర్ణులైన ముగ్గురు అభ్యర్థులు హరికృష్ణ ప్రసాద్, అరుణ కుమార్, గోపికి నియామక పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఈవో హరిహరనాథ్, పర్యవేక్షకుడు చంద్రశేఖర్, ఆలయ అర్చకులు, వేద పండితులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

## సునీల్ నాయక్ విచారణ షురూ

గుంటూరు, మార్చి 5 (ఈవార్తలు): ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజుపై గత ప్రభుత్వ హయాంలో జరిగిన 'కస్టడీ చిత్రహింసల' కేసులో ఐపీఎస్ అధికారి సునీల్ నాయక్ తొలిరోజు విచారణ ముగిసింది. గురువారం ఉదయం ప్రారంభమైన ఈ విచారణ, విజయనగరం ఎస్పీ దామోదర్ ఆధ్వర్యంలో గుంటూరులోని సీసీఎస్ పోలీస్ స్టేషన్‌లో దాదాపు 7 గంటల పాటు సుదీర్ఘంగా సాగింది. హైకోర్టు ఆదేశాల మేరకు విచారణకు హాజరైన సునీల్ నాయక్, అధికారుల ప్రశ్నలకు పొంతన లేని సమాధానాలు చెప్పినట్లు తెలుస్తోంది. రఘురామకృష్ణరాజును సీఐడీ కస్టడీలో ఉంచిన ఆ రాత్రి, సునీల్ నాయక్ పలుమార్లు ఆ కార్యాలయానికి వెళ్లినట్లు దర్యాప్తులో తేలింది. దీనిపై అధికారులు ప్రశ్నించగా, ఆయన కేవలం అరకొర సమాధానాలతోనే సరిపెట్టినట్లు సమాచారం. సీఐడీ కార్యాలయంలో ఆ రాత్రి జరిగిన పరిణామాలు, ఎవరి ఆదేశాల మేరకు ఆయన అక్కడికి వెళ్లారు అనే కోణంలో పోలీసులు లోతుగా విచారిస్తున్నారు. హైకోర్టు ఆదేశాల ప్రకారం మార్చి 5 నుంచి 9వ తేదీ వరకు ఈ విచారణ కొనసాగాల్సి ఉంది. అంటే, మరో నాలుగు రోజుల పాటు ఆయన పోలీసుల ఎదుట హాజరుకావాల్సి ఉంటుంది. రాబోయే నాలుగు రోజుల్లో ఆయన ఎలాంటి వాంగ్మూలం ఇస్తారో, ఈ కేసులో ఇంకెవరి పేర్లు బయటకు వస్తాయో వేచి చూడాలి.

## ఏపీలో టెన్త్ విద్యార్థులకు ఆర్టీసీలో ఫ్రీ

**హాల్ టికెట్ చూపించి ఉచితంగా ప్రయాణించే వెసులుబాటు**

విజయవాడ, మార్చి 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్‌లో మార్చి 16 నుంచి పదో తరగతి పరీక్షలు ప్రారంభం కానుండగా... పరీక్షలకు హాజరయ్యే విద్యార్థులకు ఏపీఎస్ఆర్టీసీ శుభవార్త చెప్పింది. పరీక్షల సమయంలో విద్యార్థులు ప్రశాంతంగా పరీక్షా కేంద్రాలకు చేరుకునేందుకు వీలుగా ఆర్టీసీ బస్సుల్లో ఉచిత ప్రయాణ సౌకర్యాన్ని కల్పిస్తున్నట్లు సంస్థ ప్రకటించింది. విద్యార్థులు తమ వెంట హాల్ టికెట్ ఉంచుకుంటే సరిపోతుంది. దానిని కండక్టర్‌కు చూపించి ఉచితంగా ప్రయాణించవచ్చు. ఈ ఉచిత ప్రయాణ సౌకర్యం కేవలం పల్లె వెలుగు, అల్ట్రా పల్లె వెలుగు, సిటీ ఆర్డినరీ బస్సుల్లో మాత్రమే అందుబాటులో ఉంటుంది. విద్యార్థులు తమ ఇంటి నుంచి పరీక్షా కేంద్రానికి వెళ్లడానికి, తిరిగి ఇంటికి రావడానికి ఈ సదుపాయాన్ని వినియోగించుకోవచ్చు.

# జనాభా తగ్గితే దక్షిణాదికి నష్టం

## ఇక జనాభా నిర్వహణ ముఖ్యం.. ఒకరు వద్దు.. ముగ్గురు ముద్దు

**మారిన పరిస్థితులకు తగ్గట్టు కొత్త నినాదం**

**ఫెర్టిలిటీ రేటు 1.5కి పడిపోవడం ప్రమాదం**

**అసెంబ్లీలో ఏపీ సీఎం చంద్రబాబు**



అమరావతి, మార్చి 5 (ఈవార్తలు): గతంలో జనాభా పెరిగితే ఏమవుతుందో అని ఆందోళన చెందాను. కానీ ఇప్పుడు మారిన పరిస్థితుల రీత్యా విధానాలు మార్చుకున్నాం... అని ముఖ్యమంత్రి చంద్రబాబు స్పష్టం చేశారు. అమరావతి అసెంబ్లీ వేదికగా పాపులేషన్ మేనేజ్మెంట్ పాలసీ ప్రకటనపై జరిగిన చర్చలో సీఎం సుదీర్ఘంగా ప్రసంగించారు. ఒకప్పుడు జనాభా నియంత్రణే పరమావధిగా భావించిన తాము, నేడు జనాభా నిర్వహణ (పాపులేషన్ మేనేజ్ మెంట్) వైపు ఎందుకు అడుగులు వేయాల్సి వచ్చిందో సవివరంగా తెలియజేశారు. ప్రస్తుతం రాష్ట్రంలో టోటల్ ఫెర్టిలిటీ రేట్ (టీఎఫ్ఆర్) ప్రమాదకర స్థాయిలో 1.5కి పడిపోయిందని సీఎం గణాంకాలతో సహా వివరించారు. ఇదే ధోరణి కొనసాగితే దక్షిణాది రాష్ట్రాల్లో నెగెటివ్ గ్రోత్ నమోదవుతుందని, భవిష్యత్తులో నియోజకవర్గాల పునర్విభజన (డీలిమిటేషన్) జరిగితే రాజకీయంగా దక్షిణాది రాష్ట్రాలు తీవ్రంగా నష్టపోయే ప్రమాదం ఉందని హెచ్చరించారు. ఈ సంక్షోభాన్ని దృష్టిలో ఉంచుకునే జనాభా నిర్వహణ విధానాన్ని తెరపైకి తెచ్చామన్నారు. గతంలో మాల్తూషియన్ థియరీ ప్రకారం జనాభా విపరీతంగా పెరిగితే ప్రకృతి వైపరీత్యాలు, కరవు కాటకాలు వస్తాయనే భయం ఉండేదని, అందుకే ఆనాడు కఠినమైన జనాభా నియంత్రణ చర్యలు చేపట్టామని చంద్రబాబు గుర్తు చేశారు. 96-97 ప్రాంతంలో ఎయిడ్స్ వ్యాధి నియంత్రణ కోసం 'బ్రేక్ సైలెన్స్' అంటూ ప్రచారాలు నిర్వహించామని, ఆర్థిక సంస్కరణలు, సాంకేతిక విప్లవం, కుటుంబ నియంత్రణ చర్యలతో సామాజికంగా ఎన్నో విజయాలు సాధించామని తెలిపారు. అయితే, నాడు తీసుకున్న ఆ చర్యల ఫలితంగా ఇప్పుడు పరిస్థితి పూర్తిగా తారుమారైందని, ప్రస్తుతం జనాభా తగ్గుదల అనేది కొత్త సవాలుగా మారిందని ఆవేదన వ్యక్తం చేశారు. "ఇప్పుడు ఒకరు వద్దు.. ఇద్దరు ఒకే.. ముగ్గురు ముద్దు" అనే కొత్త నినాదాన్ని తీసుకోవాల్సిన ఆవశ్యకత ఏర్పడిందని చంద్రబాబు పేర్కొన్నారు. చైనా కేవలం ఒక్క సంతానం విధానంతో ఇప్పుడు వృద్ధాప్య జనాభాతో తీవ్ర సమస్యలు ఎదుర్కొంటోందని ఉదహరించారు. ఈ క్రమంలోనే కుటుంబంలో ఎంతమంది పిల్లలు ఉంటే అంతమందికి 'తల్లికి వందనం' పథకం వర్తింపజేస్తామని ప్రకటించారు. కుటుంబంలో ఎక్కువ మంది సభ్యులు ఉండేలా, మైక్రో ఫ్యామిలీస్ స్థానంలో ఉమ్మడి కుటుంబాల వ్యవస్థను ప్రోత్సహించేలా ప్రభుత్వ విధానాల్లో మార్పులు చేస్తామన్నారు. పెద్ద కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్కువ ప్రోత్సాహకాలు అందిస్తామని హామీ ఇచ్చారు.

# జగన్ జీతం తీసుకోవట్లే

**సభకు రాకుండా ప్రజాస్వామ్యం పరిహాసం**

**ఏపీ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అసహనం**



అమరావతి, మార్చి 5 (ఈవార్తలు): ఆంధ్రప్రదేశ్ శాసనసభ బడ్జెట్ సమావేశాలకు వైసీపీ ఎమ్మెల్యేలు గైర్హాజరవుతుండటంపై స్పీకర్ అయ్యన్నపాత్రుడు తీవ్రంగా స్పందించారు. ఈరోజు అసెంబ్లీలో ఆయన మాట్లాడుతూ, ప్రజలు తమ సమస్యల గురించి గళం విప్పుతారని ఓట్లు వేసి గెలిపిస్తే, సభకు రాకుండా పారిపోవడం ప్రజాస్వామ్యాన్ని పరిహసించడమేనని మండిపడ్డారు. సభకు హాజరుకాకుండా కేవలం బయట ఉంటూ జీతభత్యాలు తీసుకోవడం నైతికంగా సరికాదని అన్నారు. వైసీపీ ఎమ్మెల్యేలంతా జీతాలు తీసుకుంటున్నారని, ఆ పార్టీ అధినేత జగన్ మాత్రం జీతం తీసుకోవడం లేదని చెప్పారు. కేవలం గవర్నర్ ప్రసంగం రోజున వచ్చి కాసేపు నిరసన తెలిపి వెళ్లినంత మాత్రాన అది పూర్తిస్థాయి హాజరు అనిపించుకోదని స్పీకర్ స్పష్టం చేశారు. రాజ్యాంగ నిబంధనల ప్రకారం వరుసగా 65 రోజుల పాటు సభకు అనుమతి లేకుండా గైర్హాజరైతే ఆ సభ్యులపై కఠిన చర్యలు తీసుకునే అవకాశం ఉందని, వారికి నోటీసులు జారీ చేస్తామని హెచ్చరించారు. బాధ్యతారాహిత్యంగా వ్యవహరించే ప్రజా ప్రతినిధులను 'రీకాల్' చేసే హక్కు ప్రజలకు ఉండాలని, దీనిపై చట్ట సవరణలు అవసరమని ఆయన అభిప్రాయపడ్డారు. ఈ సమస్య కేవలం ఏపీకే పరిమితం కాదని, దేశవ్యాప్తంగా చట్టసభల గౌరవాన్ని కాపాడటానికి లోక్‌సభ స్పీకర్‌ను కలిసి చర్చిస్తానని తెలిపారు. ప్రస్తుతం అసెంబ్లీలో ప్రతి ఎమ్మెల్యే సీటు వద్ద ఏర్పాటు చేసిన ఏఐ ఆధారిత ఫేషియల్ రికగ్నిషన్ కెమెరాల ద్వారా సభ్యుల హాజరును కచ్చితంగా నమోదు చేస్తున్నామని, దీని ద్వారా ఎవరు ఎంతసేపు సభలో ఉన్నారో రికార్డు అవుతుందని స్పీకర్ వివరించారు. నిబంధనల ప్రకారం కనీసం 10 శాతం సీట్లు (18 మంది ఎమ్మెల్యేలు) ఉన్న పార్టీకి మాత్రమే ప్రతిపక్ష హోదా లభిస్తుందని, కేవలం 11 సీట్లు ఉన్న వైసీపీకి ఆ హోదా ఇవ్వడం సాధ్యం కాదని అయ్యన్న పాత్రుడు మరోసారి తేల్చిచెప్పారు.

## 17న తిరుమలలో వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు

తిరుమల, మార్చి 5 (ఈవార్తలు): తిరుమల శ్రీ వేంకటేశ్వరస్వామి వారి ఆలయంలో త్వరలో జరగబోయే 'ఉగాది ఆస్థానం' వేడుకలకు సంబంధించి తిరుమల తిరుపతి దేవస్థానం (టీటీడీ) కీలక ఏర్పాట్లు చేస్తోంది. మార్చి 19న తెలుగు నూతన సంవత్సరం ఉగాదిని పురస్కరించుకుని నిర్వహించే ఈ ప్రత్యేక పర్వదినం కోసం ఆలయాన్ని శుద్ధి చేసేందుకు మార్చి 17న (మంగళవారం) 'కోయిల్ ఆళ్వార్ తిరుమంజనం' కార్యక్రమాన్ని చేపట్టనున్నారు. ఉగాది, ఆణివార ఆస్థానం, వార్షిక బ్రహ్మోత్సవాలు మరియు వైకుంఠ ఏకాదశి వంటి ప్రధాన పండుగలకు ముందు వచ్చే మంగళవారాల్లో ఈ శుద్ధి కార్యక్రమాన్ని నిర్వహించడం టీటీడీలో అనాదిగా వస్తున్న ఆచారం. ఈ నేపథ్యంలో మార్చి 17న వీఐపీ బ్రేక్ దర్శనాలు, అష్టదళ పాదపద్మారాధన సేవలను టీటీడీ రద్దు చేసింది. దీని కారణంగా మార్చి 16న ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా మిగిలిన వారికి వీఐపీ బ్రేక్ దర్శనాల కోసం సిఫార్సు లేఖలు స్వీకరించబడవు. ఉగాది పర్వదినం సందర్భంగా కూడా ప్రోటోకాల్ ప్రముఖులకు మినహా సాధారణ వీఐపీ బ్రేక్ దర్శనాలు రద్దు చేశారు. కావున మార్చి 18న సిఫార్సు లేఖలు సమర్పించే అవకాశం ఉండదు.





## కులంపై దాడి : అంబటి

వైజాగ్, మార్చి 5 (ఈవార్తలు): విశాఖపట్నంలో జరిగిన ఉమ్మడి విశాఖ జిల్లా వైసీపీ కాపు నేతల కీలక సమావేశంలో పాల్గొన్న మాజీ మంత్రి అంబటి రాంబాబు, కూటమి ప్రభుత్వంపై ముఖ్యంగా సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ లపై తీవ్రస్థాయిలో విరుచుకుపడ్డారు. కరణం ధర్మశ్రీ నివాసంలో జరిగిన ఈ 'బ్రేక్ ఫాస్ట్ మీటింగ్'లో గుడివాడ అమర్నాథ్ వంటి కాపు నేతలతో కలిసి ప్రస్తుత రాజకీయ పరిణామాలు, అక్రమ కేసులు, అరెస్టులపై సుదీర్ఘంగా చర్చించారు. అనంతరం మీడియాతో అంబటి రాంబాబు మాట్లాడుతూ తీవ్ర వ్యాఖ్యలు చేశారు. గుంటూరులోని తన నివాసంపై జరిగిన దాడిని స్వయంగా చంద్రబాబు, లోకేశ్ పర్యవేక్షించారని ఆయన ఆరోపించారు. టీవీ ఛానళ్లలో లైవ్ వస్తున్నా ప్రభుత్వం పట్టించుకోలేదని, పోలీసుల సమక్షంలోనే ఈ దౌర్జన్యం జరిగిందని మండిపడ్డారు. కేవలం దైవకృప వల్లే తాను ప్రాణాలతో బయటపడ్డానని అన్నారు. ఈ దాడిని ఒక కులం మరో కులంపై చేసిన దాడిగా ఆయన అభివర్ణించారు. సమాజంలో కులాల మధ్య చిచ్చు పెట్టి ప్రభుత్వం ఏం సాధించాలనుకుంటోందని ప్రశ్నించారు. గతంలో వంగవీటి రంగాను కూడా పోలీసుల సహకారంతోనే చంపారని, ఇప్పుడు తన విషయంలోనూ అదే పునరావృతమవుతోందని ధ్వజమెత్తారు. లోకేశ్ 'రెడ్ బుక్' బెదిరింపులకు తాము భయపడబోమని, అక్రమంగా తనను 18 రోజులు జైల్లో పెట్టారని గుర్తు చేశారు. తన జైలు శిక్ష సమయంలో ఉత్తరాంధ్ర నేతలు తన కుటుంబానికి అండగా నిలిచారని కృతజ్ఞతలు తెలిపారు. ఎర్ర బుక్కులు, పిచ్చి బుక్కులకు తాము భయపడబోమని చెప్పారు. కాపులను బీసీల్లో చేరుస్తామని గతంలో ఇచ్చిన హామీని చంద్రబాబు తుంగలో తొక్కారని, కాపుల కోసం ఉద్యమించిన ముద్రగడను వేధించారని విమర్శించారు. పవన్ కల్యాణ్ కూటమిలో ఉన్నంత మాత్రాన కాపులందరూ మీ వైపు ఉన్నారనుకోవడం భ్రమ అని ఆయన స్పష్టం చేశారు. చంద్రబాబు పతనం మొదలైందని, ఈ దాడులకు తగిన మూల్యం చెల్లించక తప్పదని హెచ్చరించారు.

# భారత్‌కు మేమున్నాం

## చమురు సరఫరాకు రెడీ: రష్యా

## అమెరికాపై భద్రతా మండలిలో చర్చ!




మాస్కో: పశ్చిమ ఆసియాలో యుద్ధ వాతావరణం కొనసాగుతున్న వేళ, అంతర్జాతీయంగా చమురు ధరలు పెరిగే ప్రమాదం ఉందన్న ఆందోళనల నడుమ రష్యా కీలక ప్రకటన చేసింది. ప్రపంచవ్యాప్తంగా ఎలాంటి పరిస్థితులు నెలకొన్నప్పటికీ, భారత్‌కు ముడి చమురు సరఫరా చేసేందుకు తాము ఎల్లప్పుడూ సిద్ధంగానే ఉన్నామని భారత్‌లోని రష్యా రాయబారి డెనిస్ అలిపోవ్ స్పష్టం చేశారు. హోర్ముజ్ జలసంధి మూసివేత భయాలు, తద్వారా ప్రపంచవ్యాప్తంగా ఇంధన ధరలు భారీగా పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ఆయన ఈ వ్యాఖ్యలు చేశారు. నేడు న్యూఢిల్లీలో విలేకరులతో మాట్లాడిన అలిపోవ్.. చమురు సరఫరాదారులు ఎవరనేది నిర్ణయించుకోవాల్సింది భారత నాయకత్వమేని, అయితే రష్యా మాత్రం భారత్‌కు ఆయిల్ ఇచ్చేందుకు ఎప్పుడూ సానుకూలంగానే ఉంటుందని భరోసా ఇచ్చారు. పశ్చిమ ఆసియాలో జరుగుతున్న ఘర్షణలపై స్పందిస్తూ, సమస్య ఏదైనా చర్చల ద్వారానే పరిష్కారం లభిస్తుందని అలిపోవ్ అభిప్రాయపడ్డారు. వీలైనంత త్వరగా ఈ ఘర్షణలకు ముగింపు పలకాల్సిన అవసరం ఉందన్నారు. ఇదే సమయంలో యుద్ధం ఇంకెంత కాలం కొనసాగుతుందని విలేకరులు ప్రశ్నించగా.. "ఆ విషయం నాకేం తెలుసు? ఈ ప్రశ్నకు సమాధానం నాకంటే అమెరికాకే బాగా తెలుసు" అని ఆయన వ్యంగ్యంగా బదులిచ్చారు. మరోవైపు, ఫిబ్రవరి 28న ఇరాన్‌పై అమెరికా, ఇజ్రాయెల్ జరిపిన సాయుధ దాడులను రష్యా తీవ్రంగా ఖండించింది. పరిస్థితిని తిరిగి రాజకీయ, దౌత్యపరమైన పరిష్కార మార్గంలోకి తీసుకురావాల్సిన అవసరం ఉందని నొక్కి చెప్పింది. ఈ మేరకు రష్యా విదేశాంగ మంత్రి సెర్గీ లావ్‌రోవ్, ఇరాన్ విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాఘ్చీతో శనివారం ఫోన్లో మాట్లాడారు. ఇరాన్ అణు కార్యక్రమానికి సంబంధించిన శాంతియుత చర్చలకు విఘాతం కలిగించేలా అమెరికా, ఇజ్రాయెల్ వ్యవహరించాయని, వారి దుందుడుకు చర్యలను అడ్డుకునేందుకు ఇరాన్ నాయకత్వం తీసుకుంటున్న చర్యలను అరాఘ్చీ వివరించారు. ఈ అంశంపై ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి సమావేశాన్ని అత్యవసరంగా ఏర్పాటు చేయాలని కోరుతున్నట్లు తెలిపారు. దీనిపై స్పందించిన రష్యా విదేశాంగ మంత్రి లావ్‌రోవ్.. అమెరికా, ఇజ్రాయెల్ దాడులు అంతర్జాతీయ చట్టాల సూత్రాలకు, నిబంధనలకు విరుద్ధమని ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రాంతీయ, ప్రపంచ స్థిరత్వానికి ఇవి తీవ్ర ముప్పు అని, పర్యవసానాలను పూర్తిగా విస్మరించి దాడులకు పాల్పడుతున్నారని మండిపడ్డారు. ఇరాన్‌పై దాడులను తక్షణమే నిలిపివేయాలని డిమాండ్ చేశారు. పరస్పర గౌరవం, అంతర్జాతీయ చట్టాల ఆధారంగా శాంతియుత పరిష్కారాల కోసం ఐక్యరాజ్యసమితి భద్రతా మండలి వేదికగా కృషి చేసేందుకు రష్యా సిద్ధంగా ఉందని లావ్‌రోవ్ హామీ ఇచ్చారు. ఇటీవల ఇరాన్ క్షిపణి సామర్థ్యాలను, సైనిక మౌలిక సదుపాయాలను లక్ష్యంగా చేసుకుని అమెరికా, ఇజ్రాయెల్ సంయుక్త దాడులు చేయడంతో పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి. ఈ దాడుల్లో ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీతో సహా పలువురు అగ్రనాయకులు మరణించడంతో పరిస్థితి మరింత దిగజారింది. దీనికి ప్రతిగా ఇరాన్ కూడా డ్రోన్, క్షిపణి దాడులతో అమెరికా స్థావరాలు, మిత్రపక్షాల బలగాలపై విరుచుకుపడుతోంది. ఈ పరిణామాల నేపథ్యంలో రష్యా రాయబారి చేసిన వ్యాఖ్యలు అంతర్జాతీయంగా ప్రాధాన్యత సంతరించుకున్నాయి.

# బీహార్‌లో ముగిసిన నితీశ్ శకం

**రాజ్యసభకు నామినేషన్ వేసిన బీహార్ సీఎం**

**సీఎం పదవిని చేపట్టబోతున్న బీజేపీ**

**సీఎం రేసులో సామ్రాట్ చౌదరి, నిత్యానంద రాయ్, దిలీప్ జైశ్వాల్**

పాట్నా: బీహార్ రాజకీయాల్లో సుదీర్ఘ కాలం పాటు ముఖ్యమంత్రిగా చక్రం తిప్పిన నితీశ్ కుమార్, రాష్ట్ర రాజకీయాల నుంచి తప్పుకుని జాతీయ రాజకీయాల వైపు అడుగులు వేయడం ఇప్పుడు దేశవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. రాజ్యసభకు నామినేషన్ దాఖలు చేసిన నేపథ్యంలో ఆయన త్వరలోనే ముఖ్యమంత్రి పదవికి రాజీనామా చేయనున్నారు. ఈ నేపథ్యంలో, బీహార్ తదుపరి ముఖ్యమంత్రి ఎవరనే చర్చ పెద్ద ఎత్తున జరుగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, కొత్త ప్రభుత్వంలో బీజేపీ ముఖ్యమంత్రి పదవిని దక్కించుకోనుంది.

**ఈ రేసులో ప్రధానంగా ముగ్గురు నేతల పేర్లు బలంగా వినిపిస్తున్నాయి. వారు ఎవరంటే...?**

సామ్రాట్ చౌదరి: ప్రస్తుతం ఉప ముఖ్యమంత్రిగా ఉన్న సామ్రాట్ చౌదరి సీఎం రేసులో అందరికంటే ముందున్నారు. ఓబీసీ (కుష్వాహా) సామాజికవర్గానికి చెందిన ఆయనకు పార్టీలో, ప్రభుత్వంలో పట్టు ఉండటం ప్లస్ పాయింట్.

నిత్యానంద రాయ్: కేంద్ర మంత్రిగా ఉన్న నిత్యానంద రాయ్ పేరు కూడా ప్రముఖంగా వినిపిస్తోంది. యాదవ సామాజికవర్గానికి చెందిన ఈయనను సీఎంగా చేయడం ద్వారా, ఆర్జేడీ (తేజస్వి యాదవ్) ఓటు బ్యాంకుకు గండి కొట్టాలని బీజేపీ భావిస్తోంది. అమిత్ షాతో నిత్యానంద రాయ్ కు సన్నిహిత సంబంధాలు ఉన్నాయి.

దిలీప్ జైశ్వాల్: బీహార్ మంత్రి దిలీప్ జైశ్వాల్ పేరు కూడా పరిశీలనలో ఉంది. వైశ్య సామాజికవర్గానికి చెందిన ఈయనకు పార్టీ అధిష్ఠానం వద్ద మంచి గుర్తింపు ఉంది.

# భారీగా తగ్గిన కోడిగుడ్డు ధర

**ఎగుమతులు నిలిచి పడిపోయిన రేటు**



న్యూఢిల్లీ: కోడిగుడ్డు ధరలు భారీగా తగ్గాయి. సాధారణంగా వేసవి కాలంలో గుడ్ల ధరలు తగ్గుతుంటాయి. కానీ ఈసారి ఇజ్రాయెల్, అమెరికా-ఇరాన్ యుద్ధం కారణంగా ఒక్కసారిగా దారుణంగా పతనమయ్యాయి. పరస్పర దాడులతో పశ్చిమాసియా రగులుతోంది. ఆరు రోజులుగా డ్రోన్లు, క్షిపణులతో ఇరాన్, ఇజ్రాయెల్-అమెరికా దేశాలు పరస్పర దాడులు చేసుకుంటున్నాయి. దీనితో ఎక్కడికక్కడ ఎగుమతులు నిలిచిపోవడం కూడా గుడ్ల ధరలు పడిపోవడానికి కారణం. ఎగుమతులు నిలిచిపోవడంతో పౌల్ట్రీ పరిశ్రమకు భారీ మొత్తంలో నష్టం చేకూరుతుంది. పశ్చిమాసియాలో తీవ్ర ఉద్రిక్తతల కారణంగా పోర్టులు, ఎయిర్ పోర్టులు మూసివేయడం పౌల్ట్రీ పరిశ్రమపై భారీ ప్రభావం పడుతోంది. ప్రస్తుతం నేషనల్ ఎగ్ కో-ఆర్డినేషన్ కమిటీ(ఎన్ఈసీసీ) ధర రూ.4.20కి పడిపోయింది. ఎగుమతులు నిలిచిపోవడంతో కొన్ని ప్రాంతాల్లో గుడ్డు ధర రూ.3.30కి కూడా పడిపోయింది.

# శ్రీలంక దిశగా రెండో ఇరాన్ యుద్ధ నౌక

కొలంబో: అమెరికా, ఇజ్రాయెల్ దేశాలతో యుద్ధం వేళ, మరో ఇరాన్ యుద్ధ నౌక శ్రీలంక దిశగా వెళుతోంది. బుధవారం ఇరాన్‌కు చెందిన యుద్ధ నౌక ఐరిస్ దేనాను అమెరికా జలాంతర్గామి ముంచివేసిన విషయం తెలిసిందే. ఈ ఘటన తర్వాత ఇరాన్ కూడా అమెరికా ట్యాంకర్‌పై దాడి చేసి ప్రతీకారం తీర్చుకున్నది. ఇలాంటి ఉద్రిక్త పరిస్థితుల్లో మరో ఇరాన్ నౌక శ్రీలంక దిశగా ప్రయాణిస్తోంది. ఈ విషయాన్ని శ్రీలంక మంత్రి నలిందా జయతిస్సా వెల్లడించారు. గురువారం నాడు పార్లమెంటులో రెండవ ఇరాన్ నౌక గురించి శ్రీలంక ప్రతిపక్ష నాయకుడు సజిత్ ప్రేమదాస అడిగిన ప్రశ్నకు మంత్రి సలిందా జయతిస్సా సమాధానమిచ్చారు. మన దేశ ప్రాదేశిక జలాలకు సమీపంలో ఆ నౌక ఉందని, అందులో ఉన్న వారి ప్రాణాలను రక్షించేందుకు ప్రయత్నాలు చేస్తున్నట్లు వెల్లడించారు. కాగా, ఈ నౌకపై కూడా అమెరికా, ఇజ్రాయెల్ దాడి చేయవచ్చనే ఆందోళనలు వ్యక్తమవుతున్నాయి. ఇందులో దాదాపు 100 మందికి పైగా సిబ్బంది ఉన్నారు. అయితే ఈ నౌక అత్యవసర పోర్ట్ కాల్ కోసం ప్రభుత్వ అనుమతిని కోరిందని, క్లియరెన్స్ కోసం వేచి చూస్తున్నట్లు శ్రీలంక ఎంపీ నమల్ రాజపక్సా తెలిపారు.

# అమెరికా మద్దతుదారులపైనా యుద్ధం

టెహ్రాన్: అమెరికా, ఇజ్రాయెల్, యూరప్‌తో పాటు వాటికి మద్దతు పలికే దేశాల నౌకలపై కూడా దాడులు చేస్తామని ఇరాన్ హెచ్చరికలు జారీ చేసింది. ఇజ్రాయెల్, అమెరికా తమ దేశంపై దాడులు చేస్తున్న నేపథ్యంలో హోర్ముజ్ జలసంధిని మూసివేసినట్లు ఇరాన్ ఇప్పటికే ప్రకటించింది. దీనితో ఈ జలసంధికి ఇరువైపుల వేలాది నౌకలు నిలిచిపోయాయి. శ్రీలంక సమీపంలో ఇరాన్ యుద్ధ నౌకపై అమెరికా దాడి చేయడంతో అమెరికా ట్యాంకర్ లక్ష్యంగా ఇరాన్ దాడికి పాల్పడింది. తాజాగా, ఇస్లామిక్ రెవల్యూషనరీ గార్డ్ కార్ప్స్ (ఐఆర్జీసీ) ఇజ్రాయెల్, అమెరికాతో పాటు వారికి మద్దతు పలికే దేశాలను కూడా హెచ్చరించింది. ఆ దేశాలకు చెందిన నౌకలను హోర్ముజ్ జలసంధి మీదుగా అనుమతించేది లేదని స్పష్టం చేసింది. హెచ్చరికలను బేఖాతరు చేస్తే ఆ నౌకలు లక్ష్యంగా దాడులు చేస్తామని తెలిపింది. అంతర్జాతీయ చట్టం, సంబంధిత తీర్మానాలకు అనుగుణంగా యుద్ధ సమయంలో హోర్ముజ్‌ను నియంత్రించే హక్కు తమకు ఉందని తెలిపింది. ఈ క్రమంలో అమెరికా, ఇజ్రాయెల్, యూరప్‌తో పాటు వాటికి మద్దతిచ్చే దేశాల నౌకలను కూడా లక్ష్యంగా చేసుకుంటామని ఇరాన్ తెలిపింది. చైనా జెండాలు ఉన్న నౌకలను అనుమతిస్తామని ఇరాన్ ఇప్పటికే స్పష్టం చేసింది. గల్ఫ్ దేశాల నుంచి భారత్, చైనా వంటి దేశాలకు హోర్ముజ్ జలసంధి మీదుగా చమురుతో పాటు పలు ఉత్పత్తులు రవాణా అవుతాయి.

# సుఖోయ్ యుద్ధ విమానం అదృశ్యం



గౌహతి: భారత వాయుసేనలో కీలకమైన సుఖోయ్ (ఎస్ యూ-30ఎంకేఐ) యుద్ధ విమానం అదృశ్యమవడం కలకలం రేపింది. రాడార్‌తో సంబంధాలు తెగిపోవడంతో విమానం ఆచూకీ గల్లంతైంది. ఈ విషయాన్ని గుర్తించిన వెంటనే అప్రమత్తమైన అధికారులు, విమానం ఆచూకీ కోసం గాలింపు చర్యలు చేపట్టారు. విమానం రాడార్ పరిధి నుంచి హఠాత్తుగా మాయమైందని, పైలట్ల రక్షణ కోసం వెంటనే సెర్చ్ అండ్ రెస్క్యూ మిషన్‌ను ప్రారంభించినట్లు తెలుస్తోంది. ఈ ఘటనపై లెఫ్టినెంట్ కల్నల్ మహేంద్ర రావత్ స్పందించారు. విమానం రాడార్ కాంటాక్ట్ కోల్పోయిన మాట వాస్తవమేనని, ప్రస్తుతం సెర్చ్ ఆపరేషన్లు ముమ్మరంగా సాగుతున్నాయని ఆయన వెల్లడించారు. మరిన్ని వివరాలు త్వరలోనే వెల్లడిస్తామని తెలిపారు. సుఖోయ్ ఎస్ యూ-30ఎంకేఐ భారత వాయుసేనలో అత్యంత శక్తివంతమైన మల్టీ-రోల్ ఫైటర్ జెట్‌గా గుర్తింపు పొందింది. రష్యా నుంచి సేకరించిన ఈ విమానాలు సరిహద్దు రక్షణతో పాటు కీలకమైన ఆపరేషన్లలో ప్రధాన పాత్ర పోషిస్తున్నాయి. అటువంటి అత్యాధునిక విమానం అదృశ్యం కావడం ఆందోళన కలిగిస్తోంది. ప్రస్తుతం విమానంలో ఎంతమంది సిబ్బంది ఉన్నారు? ప్రమాదం ఎక్కడ జరిగి ఉండవచ్చు? అనే అంశాలపై స్పష్టత రావాల్సి ఉంది. సిబ్బందిని సురక్షితంగా గుర్తించేందుకు వైమానిక దళం అన్ని రకాల చర్యలు తీసుకుంటోంది. దీనికి సంబంధించిన మరిన్ని అప్‌డేట్స్ తెలియాల్సి ఉంది.

# టారిఫ్‌లు తిరిగివ్వాలి

**మన్ హట్టన్ కోర్టు తీర్పు**

**ట్రంప్‌కు చేదు వార్త**

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అమలు చేసిన 'ట్రేడ్ టారిఫ్స్' పై అమెరికా కోర్టు పిడుగులాంటి తీర్పు ఇచ్చింది. ఈ టారిఫ్ లు అక్రమమని ఇటీవలే సుప్రీంకోర్టు తీర్పు వెలువరించింది. తాజాగా ఈ వ్యవహారంపై విచారించిన మన్ హట్టన్ కోర్టు.. టారిఫ్ ల పేరుతో వసూలు చేసిన సుమారు 130 బిలియన్ డాలర్ల (సుమారు రూ.12 లక్షల కోట్లు) ను వడ్డీ సహా దిగుమతిదారులకు వెనక్కి ఇచ్చేయాలని ఆదేశించింది. ఈమేరకు మన్ హట్టన్ లోని అంతర్జాతీయ వాణిజ్య కోర్టు జడ్జి రిచర్డ్ ఈటన్ బుధవారం ప్రభుత్వానికి ఆదేశాలు జారీ చేశారు. ట్రంప్ రెండవసారి బాధ్యతలు చేపట్టిన తర్వాత 2025 ఏప్రిల్ లో 'ఇంటర్నేషనల్ ఎమర్జెన్సీ ఎకనామిక్ పవర్స్ యాక్ట్' (ఐఈఈపీఏ) కింద ప్రపంచవ్యాప్తంగా దాదాపు అన్ని దేశాల వస్తువులపై 10% నుంచి 18% వరకు పన్నులు విధించారు. అయితే, 2026 ఫిబ్రవరి 20న సుప్రీంకోర్టు ఈ పన్నులను రాజ్యాంగ విరుద్ధమని ప్రకటించింది. పన్నులు విధించే అధికారం కాంగ్రెస్ (పార్లమెంట్) కే ఉంటుందని, అధ్యక్షుడికి లేదని స్పష్టం చేసింది.

**రిఫండ్ లు మీకు కొత్తేమీ కాదుగా..**

సుప్రీంకోర్టు తీర్పు వెలువడిన వెంటనే, ఇప్పటివరకు వసూలు చేసిన మొత్తాన్ని వెనక్కి ఇవ్వాలని జడ్జి ఈటన్ ఆదేశించారు. అసలుతో పాటు పన్ను వసూలు చేసిన రోజు నుండి లెక్కగట్టి వడ్డీని కూడా ప్రభుత్వం దిగుమతిదారులకు చెల్లించాల్సి ఉంటుంది. "రిఫండ్‌లు చేయడం మీ సిస్టమ్‌కు కొత్తేమీ కాదు. వెంటనే సాఫ్ట్‌వేర్ అప్‌డేట్ చేసి వ్యాపారస్తుల డబ్బును వాపస్ చేయండి" అని జడ్జి ఆదేశించారు. ప్రస్తుత ట్రంప్ ప్రభుత్వం ఈ తీర్పును సవాలు చేసే అవకాశం ఉంది. అయితే, అప్పటివరకు ప్రత్యామ్నాయంగా ఫిబ్రవరి 24 నుంచి 'సెక్షన్ 122' కింద తాత్కాలికంగా 10% పన్నులను ప్రభుత్వం తిరిగి అమలు చేస్తోంది. ఈ తీర్పుతో దాదాపు 3 లక్షల మంది దిగుమతిదారులకు ఊరట లభించనుంది.

# ఖమేనీ మృతికి భారత్ అధికారిక సంతాపం

న్యూఢిల్లీ: ఇరాన్ సుప్రీం లీడర్ అయతుల్లా అలీ ఖమేనీ మృతికి భారతదేశం సంతాపం ప్రకటించింది. ఇరాన్ అధినేత ఖమేనీ అమెరికా, ఇజ్రాయెల్ దాడిలో ఐదు రోజుల క్రితం మృతి చెందిన విషయం తెలిసిందే. ఇవాళ దేశ రాజధాని న్యూఢిల్లీలోని ఇరాన్ రాయబార కార్యాలయంలో విదేశాంగ కార్యదర్శి విక్రమ్ మిస్రీ అధికారికంగా సంతాప సందేశం రాశారు. భారత ప్రభుత్వం తరఫున విదేశాంగ కార్యదర్శి ఇరాన్ రాయబార కార్యాలయానికి వెళ్లారు. సంతాప సందేశాన్ని రాసిన అనంతరం మిస్రీ ఇరాన్ రాయబారితో కాసేపు మాట్లాడారు. ప్రస్తుతం పశ్చిమాసియాలో నెలకొన్న పరిస్థితులపై వారు చర్చించినట్లు తెలుస్తోంది. ఫిబ్రవరి 28న అమెరికా, ఇజ్రాయెల్ దేశాల సంయుక్త వైమానిక దాడిలో ఖమేనీ మృతి చెందారు. ఖమేనీ మృతి అనంతరం పశ్చిమాసియాలో భీకర యుద్ధం కొనసాగుతోంది.

# యుద్ధంతో సమస్యలు పరిష్కారం కావు

**ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ద్వైపాక్షిక చర్చలు.. చర్చలు, దౌత్యంతోనే సమస్యలకు పరిష్కారం : ప్రధాని మోదీ**



న్యూఢిల్లీ: ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఉద్రిక్త పరిస్థితుల నేపథ్యంలో భారత్ మరోసారి శాంతి మంత్రం జపించింది. కేవలం సైనిక చర్యలతో ఏ సమస్యా పరిష్కారం కాదని, చర్చలు, దౌత్యమే సరైన మార్గమని ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ స్పష్టం చేశారు. గురువారం నాడు ఢిల్లీలోని హైదరాబాద్ హౌస్‌లో ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్‌తో ప్రధాని మోదీ ద్వైపాక్షిక చర్చలు జరిపారు. అనంతరం ఇరువురు నేతలు సంయుక్తంగా మీడియాతో మాట్లాడారు. ఈ సందర్భంగా పశ్చిమాసియా, ఉక్రెయిన్‌లలో నెలకొన్న ఘర్షణలను ముగించేందుకు జరిగే ప్రతి ప్రయత్నానికి భారత్ మద్దతు ఇస్తుందని మోదీ హామీ ఇచ్చారు. చట్టం, న్యాయం, ప్రజాస్వామ్య విలువలపై భారత్, ఫిన్లాండ్‌లకు ఒకే రకమైన అభిప్రాయం ఉందని ఆయన తెలిపారు. ప్రస్తుతం ప్రపంచం ఎదుర్కొంటున్న సవాళ్లను పరిష్కరించడానికి అంతర్జాతీయ సంస్థల్లో సంస్కరణలు అత్యవసరమని ఇరువురు నేతలు ఏకాభిప్రాయానికి వచ్చారు. ఉగ్రవాదాన్ని అన్ని రూపాల్లోనూ నిర్మూలించడమే తమ ఉమ్మడి లక్ష్యమని మోదీ పేర్కొన్నారు. ఫిన్లాండ్ అధ్యక్షుడు అలెగ్జాండర్ స్టబ్ 'ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్' పూర్తి చేయడాన్ని ప్రస్తావిస్తూ మోదీ ఆసక్తికర వ్యాఖ్యలు చేశారు. "మీరు ఐరన్‌మ్యాన్ ట్రయాథ్లాన్ పూర్తి చేశారు.. మీలాంటి శక్తివంతమైన నాయకత్వంతో భారత్, ఫిన్లాండ్ కూడా ఇన్నోవేషన్, డిజిటల్, సస్టైనబిలిటీ అనే కొత్త 'ట్రయాథ్లాన్'ను సాధిస్తాయని నాకు నమ్మకం ఉంది" అని మోదీ చమత్కరించారు.

**కొత్త శకంలో భారత్-యూరప్ బంధం**

ప్రస్తుతం ప్రపంచం అస్థిరత, అనిశ్చితి మధ్య ఉందని, ఉక్రెయిన్ నుంచి పశ్చిమాసియా వరకు అనేక ప్రాంతాల్లో ఘర్షణలు కొనసాగుతున్నాయని మోదీ ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో ప్రపంచంలోని రెండు పెద్ద దౌత్య శక్తులైన భారత్, యూరప్ మధ్య సంబంధాలు స్వర్ణయుగంలోకి ప్రవేశిస్తున్నాయని ఆయన అభివర్ణించారు. 2026 ప్రారంభంలో కుదిరిన చారిత్రాత్మక 'ఇండియా-యూరోపియన్ యూనియన్ స్వేచ్ఛా వాణిజ్య ఒప్పందం' గురించి ప్రధాని ప్రత్యేకంగా ప్రస్తావించారు. ఈ ఒప్పందం ద్వారా భారత్, ఫిన్లాండ్ మధ్య వాణిజ్యం, పెట్టుబడులు, సాంకేతిక సహకారం మరింత బలపడుతుందని ఆశాభావం వ్యక్తం చేశారు. ఇరు దేశాల మధ్య ఆవిష్కరణల వ్యవస్థను అనుసంధానించేందుకు సమగ్ర 'మైగ్రేషన్ అండ్ మొబిలిటీ' (వలసలు మరియు రాకపోకల) ఒప్పందంపై సంతకాలు చేసినట్లు ప్రధాని ప్రకటించారు. భారతీయ విద్యార్థులకు, ప్రతిభావంతులకు ఫిన్లాండ్ ఇప్పుడు ఒక ప్రాధాన్య గమ్యస్థానంగా మారుతోందన్నారు. ఈ ఒప్పందం వల్ల ఇరు దేశాల మధ్య పరిశోధనలు, స్టార్టప్ సహకారం మరింత బలపడుతుందని తెలిపారు. విద్యా రంగంలో ఫిన్లాండ్ ప్రపంచానికే ఆదర్శంగా నిలుస్తోందని కొనియాడిన మోదీ.. ఉపాధ్యాయ శిక్షణ, స్కూల్-టు-స్కూల్ భాగస్వామ్యం, భవిష్యత్ విద్యా విధానాలపై సహకారాన్ని విస్తరించుకోవడానికి అంగీకరించినట్లు వెల్లడించారు. నార్డిక్ ప్రాంతంలో ఫిన్లాండ్ భారత్‌కు ముఖ్యమైన భాగస్వామి అని, ఆర్కిటిక్, ధృవ ప్రాంతాల పరిశోధనల్లోనూ తమ సహకారం కొనసాగుతుందని మోదీ స్పష్టం చేశారు.

# ఇరాన్ నౌకసిగ్నల్స్ రాగానే స్పందించాం



న్యూఢిల్లీ: ఇరాన్ నౌక పంపిన అత్యవసర సందేశం పట్ల వెంటనే స్పందించామని, మానవతా దృక్పథంతో సహాయక చర్యలు చేపట్టామని భారత నౌకాదళం వెల్లడించింది. ఇరాన్ నావికాదళానికి చెందిన ఫ్రిగేట్ 'ఐరిస్ డెనా' నిన్న శ్రీలంక తీరానికి సమీపంలో అమెరికా దాడికి గురై మునిగిపోవడం తీవ్ర సంచలనం సృష్టించింది. ఈ ఘటనపై భారత నౌకాదళం గురువారం అధికారిక ప్రకటన విడుదల చేసింది. ఆపదలో ఉన్న నావికులను రక్షించేందుకు శ్రీలంక నావికాదళంతో కలిసి సంయుక్తంగా 'సెర్చ్ అండ్ రెస్క్యూ' ఆపరేషన్లను నిర్వహిస్తున్నట్లు తెలిపింది. మార్చి 4వ తేదీ ఉదయం శ్రీలంకలోని గాల్లే తీరానికి సుమారు 20 నాటికల్ మైళ్ల దూరంలో ఐరిస్ డెనా నౌక నుంచి డిస్ట్రెస్ కాల్ (ఆపద సంకేతం) వచ్చినట్లు శ్రీలంక మారిటైమ్ రెస్క్యూ కోఆర్డినేషన్ సెంటర్ (ఎంఆర్ సీసీ) గుర్తించింది. ఈ సమాచారం అందిన వెంటనే భారత నౌకాదళం అప్రమత్తమైంది. ఉదయం 10 గంటల సమయంలో లాంగ్ రేంజ్ మారిటైమ్ పెట్రోల్ ఎయిర్‌క్రాఫ్ట్‌ను ఘటనా స్థలానికి పంపించి గాలింపు చర్యలు ప్రారంభించింది. సముద్రంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు లైఫ్ రాఫ్ట్‌లను ఎయిర్-డ్రాప్ చేయడానికి మరో విమానాన్ని కూడా సిద్ధం చేసింది. అంతేకాకుండా, సమీపంలోనే ఉన్న భారతీయ సెయిలింగ్ ట్రైనింగ్ షిప్ 'ఐఎన్ఎస్ తరంగిణి'ని వెంటనే ఘటనా స్థలానికి మళ్లించారు. ఇది సాయంత్రం 4 గంటలకు అక్కడికి చేరుకుని సహాయక చర్యల్లో భాగస్వామ్యమైంది. గాలింపు చర్యలను మరింత బలోపేతం చేసేందుకు కొచ్చి నుంచి సర్వే వెసెల్ 'ఐఎన్ఎస్ ఇక్షక్'ను కూడా పంపించారు. ప్రస్తుతం ఈ నౌకలు ఆ ప్రాంతంలో ముమ్మరంగా గాలింపు చర్యలు చేపడుతున్నాయి. ఈ ఘటనలో శ్రీలంక నావికాదళం సత్వరమే స్పందించి 32 మంది గాయపడిన ఇరానియన్ నావికులను రక్షించింది. దురదృష్టవశాత్తు కొన్ని మృతదేహాలను కూడా వెలికితీశారు. నౌకలో సుమారు 130 నుంచి 180 మంది సిబ్బంది ఉన్నట్లు అంచనా వేస్తుండటంతో, మిగిలిన వారి ఆచూకీ కోసం గాలింపు కొనసాగుతోంది. విశేషమేమిటంటే, ఈ ఇరాన్ నౌక ఇటీవల విశాఖపట్నంలో భారత నౌకాదళం భారీ స్థాయిలో నిర్వహించిన 'మిలాన్-2026' విన్యాసాల్లో పాల్గొని తిరిగి వెళుతుండగా ఈ దాడి చోటుచేసుకుంది. అమెరికా సబ్‌మెరైన్ నుంచి వచ్చిన టార్పెడో దాడి వల్లే ఇరాన్ నౌక మునిగిపోయిందని వెల్లడైంది. ఈ ఘటనను ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాఘ్చి తీవ్రంగా ఖండించారు. అంతర్జాతీయ జలాల్లో, భారత నేవీ అతిథిగా ఉన్న నౌకపై హెచ్చరిక లేకుండా దాడి జరగడాన్ని "సముద్రంలో అఘాయిత్యం"గా అభివర్ణించారు. అమెరికా చర్యలకు తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.

# అమెజాన్‌లో మళ్లీ కోతలు

**100 మంది ఉద్యోగులపై ప్రభావం**

**లేఆఫ్‌లను ధ్రువీకరించిన కంపెనీ**




న్యూయార్క్: ప్రముఖ ఈ-కామర్స్ దిగ్గజం అమెజాన్‌లో వరుస లేఆఫ్‌లు ఆందోళన కలిగిస్తున్నాయి. 2026లో రెండు నెలల కాలంలో ఈ సంస్థ 16 వేల మంది ఉద్యోగులను తొలగించింది. మరిన్ని తొలగింపులు ఉంటాయని అప్పుడే తెలిపింది. తాజాగా రోబోటిక్స్ విభాగంలోని ఉద్యోగులను తొలగిస్తోంది. సుమారు 100 మంది ఉద్యోగులపై ప్రభావం పడిందని సంబంధిత వ్యక్తులు వెల్లడించారంటూ మీడియాలో కథనాలు వచ్చాయి. అమెజాన్ గోదాముల్లో పనిని ఆటోమేషన్ చేయడానికి రోబోలను డిజైన్ చేసే టీమ్ ఉంటుంది. ఈ రోబోటిక్స్ టీమ్‌పై ఇప్పుడు ప్రభావం పడింది. ఎంతమందిని తొలగించారన్నది అమెజాన్ వెల్లడించనప్పటికీ, లేఆఫ్‌లను మాత్రం ధ్రువీకరించింది. వేర్ హౌస్‌లో కార్మికులకు సహాయపడేందుకు రోబోటిక్ విభాగమైన బ్లూజే గత సంవత్సరం అక్టోబర్‌లో రోబోలను ప్రదర్శించింది. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న వ్యవహారం కావడంతో ఈ జనవరిలో వీటి తయారీని నిలిపివేసింది. ఈ క్రమంలో ఉద్యోగుల తొలగింపును ప్రకటించింది. గత ఏడాది అక్టోబర్‌లో 14 వేల మందిని తొలగించిన అమెజాన్, ఈ ఏడాది జనవరిలో 16 వేల మందిపై వేటు వేసింది. కృత్రిమ మేధ (ఏఐ), ఖర్చుల తగ్గింపులో భాగంగా ఈ కొద్ది కాలంలో 30 వేల మంది ఉద్యోగులను తొలగించింది.

ఈవార్తలు
# వినోదవాణి
CINEMA
శుక్రవారం 6-3-2026 | www.evarthalu.com


## వయ్యారి చిత్రం


నేహా మాలిక్

## బ్రా స్ట్రాప్ కనిపిస్తే తప్పేంటి?: వరలక్ష్మి



హీరోయిన్ల డ్రెస్సింగ్‌పై ఇటీవల నటుడు శివాజీ చేసిన వ్యాఖ్యలు పెద్ద వివాదానికి దారితీసిన విషయం తెలిసిందే. సోషల్ మీడియాలో కూడా ఈ అంశంపై తీవ్ర చర్చలు జరిగాయి. ఈ నేపథ్యంలో ప్రముఖ నటి వరలక్ష్మీ శరత్ కుమార్ తాజాగా స్పందిస్తూ కీలక వ్యాఖ్యలు చేశారు. మహిళల వ్యక్తిగత స్వేచ్ఛను గౌరవించాల్సిందేనని ఆమె స్పష్టం చేశారు. వరలక్ష్మీ శరత్ కుమార్ దర్శకత్వం వహించిన సరస్వతి సినిమా విడుదలకు సిద్ధమవుతోంది. ఫిబ్రవరి 6న ప్రేక్షకుల ముందుకు రానున్న ఈ చిత్ర ప్రమోషన్స్‌లో భాగంగా ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో ఆమె ఈ విషయాలపై మాట్లాడారు. నటిగా ఉన్నప్పుడు తన పాత్రపై మాత్రమే దృష్టి పెట్టాల్సి ఉంటుందని, కానీ దర్శకురాలిగా మొత్తం సినిమాను చూసుకోవాల్సి రావడం చాలా పెద్ద బాధ్యత అని తెలిపారు. నటనతో పోలిస్తే దర్శకత్వం పూర్తిగా భిన్నమైన అనుభవమని ఆమె చెప్పుకొచ్చారు. ఈ సందర్భంగా నటీమణుల డ్రెస్సింగ్‌పై వస్తున్న విమర్శల గురించి కూడా ఆమె తన అభిప్రాయాన్ని వెల్లడించారు. ఒక వ్యక్తి ఏ దుస్తులు వేసుకోవాలనేది పూర్తిగా వారి వ్యక్తిగత నిర్ణయమని, దానిపై ఇతరులు తీర్పు ఇవ్వడం సరైంది కాదని ఆమె అన్నారు. మీకొక చెల్లి ఉంటే ఆమె షార్ట్ వేసుకుని బయటకు వెళ్తే రేప్ చేయాలని మీకు అనిపిస్తుందా? మహిళల డ్రెస్సింగ్‌ను ఎందుకు తప్పుబడతారు? ఒక అమ్మాయి బ్రా స్ట్రాప్ అనుకోకుండా బయటకు కనిపిస్తే అది పెద్ద తప్పు చేసినట్లుగా లేదా ప్రపంచమే అంతమైపోయినట్లుగా ఎందుకు చూస్తారని ఆమె ప్రశ్నించారు. బ్రా అనేది కేవలం ఒక ఇన్నర్‌వేర్ మాత్రమేనని, అది మహిళలకు సాధారణమైన మరియు అవసరమైన వస్త్రమని ఆమె స్పష్టం చేశారు వరలక్ష్మీ శరత్ కుమార్.

## విజయ్-త్రిష.. రిలేషన్ కన్ఫర్మ్?



తమిళ స్టార్ హీరో దళపతి విజయ్ తన వ్యక్తిగత జీవితానికి సంబంధించి ప్రస్తుతం సోషల్ మీడియాలో తీవ్ర విమర్శలను ఎదుర్కొంటున్నాడు. ఆయన భార్య సంగీత సోర్ణలింగం ఇటీవల చెంగల్పట్టు ఫ్యామిలీ కోర్టులో విడాకుల కోసం దరఖాస్తు చేయడమే దీనికి ప్రధాన కారణం. విజయ్ ఒక నటితో వివాహేతర సంబంధం పెట్టుకున్నారని, దీనివల్ల తమ 27 ఏళ్ల వైవాహిక బంధం దెబ్బతిన్నదని సంగీత తన పిటిషన్‌లో ఆరోపించారు. విజయ్ గత కొంతకాలంగా నటి త్రిషతో సహజీవనంలో ఉన్నారంటూ నెట్టింట పెద్ద ఎత్తున ప్రచారం జరుగుతోంది. ఇలాంటి పరిస్థితుల మధ్య, విజయ్ మరియు త్రిష గురువారం చెన్నైలో జరిగిన ఒక వివాహ రిసెప్షన్‌కు కలిసి హాజరై అందరినీ ఆశ్చర్యపరిచారు. ప్రముఖ నిర్మాత ఎస్. కల్పాతి సురేష్ మరియు మీనాక్షి సురేష్ దంపతుల కుమారుడి వివాహ వేడుకలో వీరిద్దరూ జంటగా కనిపించారు. ఒకే కారులో వేదిక వద్దకు చేరుకున్న వీరిద్దరి వీడియో ప్రస్తుతం సోషల్ మీడియాలో వైరల్ అవుతూ సంచలనం సృష్టిస్తోంది. తమపై వస్తున్న విమర్శలు మరియు ట్రోలింగ్ గురించి తెలిసినప్పటికీ, వీరిద్దరూ బహిరంగంగా ఒకే వేడుకలో పాల్గొనడం ఇప్పుడు చర్చనీయాంశంగా మారింది. కొందరు వీరిద్దరూ త్వరలోనే తమ బంధం గురించి అధికారిక ప్రకటన చేయబోతున్నారని హింట్ ఇచ్చారని పేర్కొంటున్నారు.

## త్వరలో పూజా హెగ్డే పెళ్లి?



పూజాహెగ్డే కి తల్లిదండ్రులు పెళ్లి కొడుకుని వెతికే పనిలో పడ్డట్లు తెలుస్తోంది. అమ్మడి వయసు ఇప్పటికే 35 ఏళ్లు నిండటంతో పెళ్లి చేసుకోమని ఇంట్లో తల్లిదండ్రులు ఒత్తిడి చేస్తున్నారుట. కొన్ని నెలలుగా ఈ ఒత్తిడి మొదలైన నేపథ్యంలో తాజాగా పెళ్లి విషయంలో సంబంధాలు చూడండని చెప్పిందిట. డాడ్ మంజునాథ్ హెగ్డే..మామ్ లతా హెగ్డే ఓ పెద్ద వ్యాపారవేత్త కుటుంబం నుండి సంబంధాన్ని పరిశీలిస్తున్నట్లు తెలిసింది. ముంబైకి చెందిన బిజినెస్‌మెన్‌తో ఆమె పెళ్లి ఉండవచ్చని వార్తలొస్తున్నాయి. మరి ఈ ప్రచారంలో నిజానిజాలు తేలాల్సి ఉంది. పూజాహెగ్డే మనసులో ఎవరైనా ఉన్నారా? లవ్..రిలేషన్ షిప్ అంటూ కొందరి పేర్లు గతంలోనే తెరపైకి వచ్చాయి. దివంగత నటుడు నవినోద్ మెహ్రా కుమారుడు, నటుడు రోహన్ మెహ్రా సన్నిహితంగా ఉంటుందనే ప్రచారం జరిగింది. వీరిద్దరూ పలుమార్లు ముంబైలో కెమెరా కంటికి చిక్కారు. 2024 ఏప్రిల్‌లో పూజా తల్లిదండ్రులతో కలిసి రోహన్ లంచ్‌కు వెళ్లడం సోషల్ మీడియాలో పెద్ద చర్చకు దారితీసింది. అటుపై -కిసీకా భాయ్ కిసీకా జాన్- షూటింగ్ సమయంలో సల్మాన్ ఖాన్ తోనూ ప్రేమలో ఉందనే ప్రచారం జరిగింది. పూజాహెగ్డే సోదరుడు రిషబ్ హెగ్డే పెళ్లికి సల్మాన్ అటెండ్ అవ్వడం అప్పట్లో చర్చనీయాంశం అయింది. అలాగే కర్ణాటకకు చెందిన ఓ క్రికెటర్‌ను పెళ్లాడుతుందనే కథనాలు వైరల్ అయ్యాయి. చివరిగా బాలీవుడ్ యువ నటుడు ఇషాన్ కట్టర్ తోనూ అమ్మడు సన్నిహితంగా దిగిన ఫోటోలు ఎన్నో సందేహాలకు తావిచ్చాయి. ఇద్దరు కలిసి ట్రిప్పులకు వెళ్లడం, సరదాగా గడపడం వంటివి చూసి సంథింగ్ సంథింగ్ నడుస్తుందనే ప్రచారం జరిగింది. అయితే ఈ ప్రచారాలపై పూజాహెగ్డే ఏనాడు స్పందించకపోవడంతో ఇవన్నీ కల్పిత కథనాలుగా బాలీవుడ్ మీడియా పేర్కొంది.

## రాజశ్రీ దేశ్ పాండేకు బ్రెస్ట్ క్యాన్సర్

సేక్రేడ్ గేమ్స్ తో ఊహించని పాపులారిటీ సొంతం చేసుకున్న రాజశ్రీ దేశ్ పాండే క్యాన్సర్ బారినపడ్డారు. తనకు గ్రేడ్ వన్ బ్రెస్ట్ క్యాన్సర్ వచ్చిందని, అదృష్టవశాత్తు సాధారణ వైద్య పరీక్షల సమయంలోనే ఈ విషయం బయటపడిందని, ప్రస్తుతం చికిత్స తీసుకుంటున్నానని ఒక ఎమోషనల్ పోస్ట్ పంచుకుంది. ఇకపోతే ఈ సమస్య నుండి బయటపడడానికి అనేక పరీక్షలు, శస్త్ర చికిత్సలు జరిగినప్పటికీ తన కుటుంబ సభ్యుల ప్రేమ, అభిమానుల మద్దతు తనకు మరింత బలాన్ని ఇచ్చాయని.. ప్రస్తుతం తాను కోలుకుంటున్నానని తెలిపింది.



## నెక్ట్స్ ఏంటి?

నేషనల్ క్రష్ రష్మికా మందన్నా ఓ ఇంటిదైపోయింది. నటుడు విజయ్ దేవరకొండను ప్రేమ వివాహం చేసుకుని ధాంపత్య జీవితంలోకి అడుగు పెట్టింది. తెలంగాణ ఇంట కోడలవుతానని రష్మిక ఏనాడు ఊహించి ఉండదు. నట జర్నీ లో భాగంగా ఇదంతా అనుకోకుండా జరిగిన ప్రక్రియ. ఏది ఏమైనా ప్రేమించిన చెలికాడుని వివాహం చేసుకుని కొత్త జీవితం ప్రారంభించడం గొప్ప విషయం. నిండు నూరేళ్లు ఆ నవదంపతుల జీవితం సంతోషంగా సాగిపోవాలని ఆశీద్దాం. ఇక రష్మిక కెరీర్ లో సెకెండ్ ఇన్నింగ్స్ ప్రారంభమైనట్లే. ఇకపై తన సినీ ప్రయాణాన్ని ఎంత కొత్తగా ప్లాన్ చేస్తుంది? అన్నది ఆసక్తికరం. భర్త కూడా నటుడే కాబట్టి నటిగా రష్మికు ఎలాంటి కండీషన్లు పెట్టడు అన్నది అంతా భావిస్తున్నది. స్వేచ్ఛగా సినిమాలు చేసుకునే వెసులబాటు రష్మికకు ఉంటుంది. అయితే పాత్రల పరంగా రష్మిక ఎంత సెలక్టివ్ గా ఉంటుంది అన్నది కీలకం. పెళ్లికి ముందు రష్మిక వెండి తెరపై ఎంతో బోల్డ్ గా కనిపించింది. గ్లామర్ పాత్రల పరంగా ఏనాడు వెనకడుగు వేసింది లేదు. పూర్తిగా దర్శకుల హీరోయిన్ గానే పనిచేసింది. బాలీవుడ్ కి వెళ్లిన తర్వాత అక్కడ సంస్కృతికి చాలా సులభంగా అర్థం చేసుకుంది. అక్కడ సెలబ్రిటీస్ లో మింగిల్ అవ్వడానికి పెద్దగా సమయం తీసుకోలేదు. తనదైన చలాకీ తనంతో నార్త్ హీరోయిన్లతో కలిసి పోయింది. అక్కడ నటించింది కొన్ని సినిమాలే అయినా? ప్రత్యేకమైన ఫాలోయింగ్ ను సంపాదించుకుంది. అయితే బాలీవుడ్ లో ప్రయాణం ఇప్పుడే మొదలైంది. అక్కడ తాను సాధించాల్సింది ఇంకా చాలానే ఉంది.



## వృషకర్మ.. నిధి అన్వేషకుడిగా చైతూ!




అక్కినేని నాగచైతన్య నటిస్తున్న ప్రెస్టీజియస్ చిత్రం 'వృషకర్మ' ఇప్పటికే సినీ వర్గాల్లో భారీ అంచనాలు క్రియేట్ చేసింది. పైగా పాన్ ఇండియా స్థాయిలో ఇది రానుంది. దర్శకుడు కార్తీక్ దండు డైరెక్ట్ చేస్తున్న ఈ సినిమా నుంచి తాజాగా దీని గ్లింప్స్‌ను విడుదల చేశారు. చైతూ ఈ యాక్షన్ అడ్వెంచర్ థ్రిల్లర్‌లో అర్జున్ అనే నిధి అన్వేషకుడిగా కనిపించబోతున్నారు. చైతుకి జోడీగా మీనాక్షి చౌదరి నటిస్తోంది. మొత్తానికి ఈ గ్లింప్స్ చాలా బాగా ఆకట్టుకుంటోంది. ఈ గ్లింప్స్‌తో 'వృషకర్మ'లో మంచి విజువల్ ట్రీట్ ఇచ్చారు. ఇక ఈ సినిమాలో నాగచైతన్య చేసే అడ్వెంచర్ ప్రేక్షకులను కచ్చితంగా కట్టిపడేస్తుందని మేకర్స్ ధీమా వ్యక్తం చేస్తున్నారు. ఈ సినిమాలో మీనాక్షి చౌదరి హీరోయిన్‌గా నటిస్తుండగా అజనీష్ లోక్‌నాథ్ సంగీతం అందిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వెంకటేశ్వర సినీ చిత్ర బ్యానర్‌పై బివిఎస్ఎన్ ప్రసాద్ ప్రొడ్యూస్ చేస్తున్నారు.



## 19న ఉస్తాద్

**వారం ముందే రిలీజ్.. హాలీడేస్‌తో ప్లాన్ చేంజ్!**

పవన్ కల్యాణ్ నటిస్తున్న ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా మార్చి 26వ తేదీన ఈ సినిమాను రిలీజ్ చేస్తామని మేకర్స్ ప్రకటించినప్పటికీ.. వారం ముందే అనగా మార్చి 19వ తేదీన ఈ సినిమాను విడుదల చేస్తున్నామని తాజాగా ప్రకటించారు. వారం ముందే ప్రేక్షకులు ఎంతగానో ఎదురుచూస్తున్న మోస్ట్ అవైటెడ్ ఫిలిమ్ ఉస్తాద్ భగత్ సింగ్ సినిమా ప్రేక్షకుల ముందుకు రానున్న నేపథ్యంలో నిర్మాతలు ఈ రిలీజ్ డేట్ ను మార్చడం వెనుక అసలు విషయం తెలిసి అందరూ ఆశ్చర్యపోతున్నారు. ముఖ్యంగా సినిమాకి మొదటి షో హిట్ టాక్ గనక లభించినట్లయితే.. ఈ చిత్రంనిర్మాతలకు కాసుల వర్షం కురిపిస్తుంది అనడంలో సందేహం లేదు అనే కామెంట్లు వ్యక్తం అవుతున్నాయి. సాధారణంగా ఏ హీరో అయినా సరే తమ సినిమాను విడుదల చేసేటప్పుడు కచ్చితంగా హాలిడేస్ ను పరిగణలోకి తీసుకొని మరీ తమ సినిమాను విడుదల చేస్తారు. అయితే ఇక్కడ ఉస్తాద్ కోసం మేకర్స్ తీసుకున్న నిర్ణయానికి ఏకంగా 10 రోజులు కలిసి రావడం ఎవరు ఊహించని పరిణామం. మార్చి 19వ తేదీన ఈ సినిమా రాబోతోంది.. కాబట్టి మార్చి 18న ఈ సినిమా ప్రీమియర్స్ స్టార్ట్ అవుతాయి.. ఇక మార్చి 19వ తేదీ గురువారం ఉగాది పండుగ .. మార్చి 20 శుక్రవారం రంజాన్..



# భయపెట్టిన బెతెల్!



## ఒంటరి పోరు.. శతకం వృథా.. మలుపు తిప్పిన బుమ్రా

### ఉత్కంఠపోరులో భారత్ విజయం.. ఫైనల్‌లో కివీస్‌తో పోరు

ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో టీమిండియా ఫైనల్‌కు దూసుకెళ్లింది. ఉత్కంఠకే ఊపిరి అందని రీతిలో సాగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో టీమిండియా అద్భుత బౌలింగ్ ప్రదర్శనతో చిరస్మరణీయమైన విజయాన్నందుకుంది. గురువారం వాంఖడే మైదానం వేదికగా జరిగిన ఈ మ్యాచ్‌లో భారత్ 7 పరుగుల తేడాతో ఇంగ్లండ్‌ను ఓడించింది.

**254 పరుగుల భారీ లక్ష్యాన్ని కాపాడుకునేందుకు టీమిండియా బౌలర్లు చెమటోడ్చాల్సి వచ్చింది. జాకోబ్ బెతెల్ విధ్వంసకర శతకంతో టీమిండియాను వణికించాడు. జస్‌ప్రీత్ బుమ్రా, హార్దిక్ పాండ్యా అసాధారణ బౌలింగ్ ప్రదర్శనతో సత్తా చాటితే.. అక్షర్ పటేల్ స్టన్నింగ్ ఫీల్డింగ్‌తో టీమిండియా విజయంలో కీలక పాత్ర పోషించాడు. ఈ మ్యాచ్‌లో ముందుగా బ్యాటింగ్ చేసిన భారత్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 253 పరుగుల భారీ స్కోర్ చేసింది.**

సంజూ శాంసన్ విధ్వంసకర హాఫ్ సెంచరీతో చెలరేగగా.. శివమ్ దూబే(25 బంతుల్లో ఫోర్, 4 సిక్స్‌లతో 43), ఇషాన్ కిషన్(18 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 39) మెరుపులు మెరిపించారు. చివర్లో తిలక్ వర్మ(7 బంతుల్లో 3 సిక్సర్లతో 21), హార్దిక్ పాండ్యా(12 బంతుల్లో 3 ఫోర్లు, 2 సిక్స్‌లతో 27)దూకుడుగా ఆడారు. ఇంగ్లండ్ బౌలర్లలో విల్ జాక్స్(2/40), ఆదిల్ రషీద్(2/41) రెండేసి వికెట్లు తీయగా... జోఫ్రా ఆర్చర్ ఒక వికెట్ పడగొట్టాడు. ఈ మ్యాచ్‌లో భారత బ్యాటర్లు 19 సిక్సర్లు, 20 ఫోర్లు బాదారు. అనంతరం ఇంగ్లండ్ నిర్ణీత 20 ఓవర్లలో 7 వికెట్లకు 246 పరుగులు చేసి ఓటమిపాలైంది. జాకోబ్ బెతెల్(48 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 105 ) శతకంతో ఒంటరి పోరాటం చేయగా.. విల్ జాక్స్(20 బంతుల్లో 4 ఫోర్లు, 2 సిక్స్‌లతో 35) కీలక ఇన్నింగ్స్ ఆడాడు. భారత బౌలర్లలో హార్దిక్ పాండ్యా(2/38) రెండు వికెట్లు తీయగా.. అర్ష్‌దీప్ సింగ్, జస్‌ప్రీత్ బుమ్రా(1/33), వరుణ్ చక్రవర్తి, అక్షర్ పటేల్ తలో వికెట్ తీసారు. చివరి 18 బంతుల్లో ఇంగ్లండ్ విజయానికి 45 పరుగులు అవసరం కాగా.. 18వ ఓవర్ వేసిన జస్‌ప్రీత్ బుమ్రా 6 పరుగులు మాత్రమే ఇచ్చాడు. దాంతో చివరి 12 బంతుల్లో ఇంగ్లండ్ విజయానికి 39 పరుగులు అవసరమయ్యాయి. హార్దిక్ పాండ్యా 19వ ఓవర్‌లో తొలి బంతినే సిక్సర్ బాదిన జాకోబ్ బెతెల్ 45 బంతుల్లో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. ఈ ఓవర్ మూడో బంతికి సామ్ కరణ్‌ను ఔట్ చేసిన హార్దిక్ పాండ్యా.. తర్వాతి మూడు బంతులను కట్టడిగా వేసి ఈ ఓవర్‌లో మొత్తం 9 పరుగులే ఇచ్చాడు. ఆఖరి ఓవర్‌లో ఇంగ్లండ్ విజయానికి 30 పరుగులు అవసరం కాగా.. శివమ్ దూబే వేసిన ఈ ఓవర్ తొలి బంతికి క్విక్ డబుల్ తీసే ప్రయత్నంలో డేంజరస్ బెతెల్ రనౌటయ్యాడు. తర్వాతి రెండు బంతులను డాట్ చేసిన శివమ్ దూబే.. భారత్ విజయాన్ని లాంఛనం చేశాడు. చివరి మూడు బంతుల్లో మూడు సిక్స్‌లు, వైడ్ ఇచ్చినా.. టీమిండియాకు నష్టం జరగలేదు. పరుగుల వరద మారిన ఈ మ్యాచ్‌లో ఇరు జట్ల మధ్య ఉన్న ప్రధాన వ్యత్యాసం జస్‌ప్రీత్ బుమ్రా. ఈ మ్యాచ్‌లో 4 ఓవర్లు వేసిన బుమ్రా 33 పరుగులు మాత్రమే ఇచ్చి ఒక వికెట్ తీసాడు. అతని కట్టుదిట్టమైన బౌలింగ్ ఇంగ్లండ్ పతనాన్ని శాసించింది. ఆదివారం అహ్మదాబాద్ వేదికగా జరిగే ఫైనల్లో న్యూజిలాండ్‌తో టీమిండియా అమీతుమీ తేల్చుకోనుంది.



## చరిత్ర సృష్టించిన సంజూ శాంసన్

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ సంజూ శాంసన్ చరిత్ర సృష్టించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ చరిత్రలోనే నాకౌట్ మ్యాచ్‌లో అత్యధిక వ్యక్తిగత స్కోర్ నమోదు చేసిన తొలి భారత ఓపెనర్‌గా నిలిచాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026 టోర్నీలో భాగంగా వాంఖడే మైదానం వేదికగా గురువారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో సంజూ శాంసన్ (42 బంతుల్లో 8 ఫోర్లు, 7 సిక్స్‌లతో 89) విధ్వంసకర హాఫ్ సెంచరీతో ఈ ఫీట్ సాధించాడు. ఈ టోర్నీలో సంజూ శాంసన్‌కు వరుసగా రెండో హాఫ్ సెంచరీ ఇది. వెస్టిండీస్‌తో జరిగిన గత మ్యాచ్‌లో 97 పరుగులతో అజేయంగా నిలిచి మ్యాచ్ విన్నింగ్ ప్రదర్శన చేసిన సంజూ శాంసన్.. తాజా మ్యాచ్‌లోనూ అదే జోరు కనబర్చాడు. దాంతో విరాట్ కోహ్లీ పేరిట గత 10 ఏళ్లుగా చెక్కు చెదరకుండా ఉన్న రికార్డ్‌ను సమం చేశాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో ఇదే వాంఖడే మైదానం వేదికగా వెస్టిండీస్‌తో జరిగిన సెమీఫైనల్లో విరాట్ కోహ్లీ 89 పరుగులు చేశాడు. తాజా మ్యాచ్‌లోనూ సంజూ శాంసన్ సరిగ్గా 89 పరుగులే చేసి విరాట్ కోహ్లీ రికార్డ్‌న సమం చేశాడు. ఓవరాల్‌గా ఐసీసీ టీ20 ప్రపంచకప్ నాకౌట్ మ్యాచ్‌ల్లో అత్యధిక పరుగులు చేసిన నాలుగో బ్యాటర్‌గా సంజూ శాంసన్ నిలిచాడు. బుధవారమే సౌతాఫ్రికాతో జరిగిన తొలి సెమీఫైనల్లో న్యూజిలాండ్ ఓపెనర్ ఫిన్ అలెన్(34 బంతుల్లో 100 నాటౌట్) అజేయ సెంచరీతో ఈ జాబితాలో అగ్రస్థానంలో నిలిచిన సంగతి తెలిసిందే. తాజా మ్యాచ్‌తో సంజూ శాంసన్ ఈ జాబితాలోకి ఎంట్రీ ఇచ్చాడు.

## అభిషేక్ శర్మ.. మళ్లీ ఫ్లాప్

టీమిండియా విధ్వంసకర ఓపెనర్ అభిషేక్ శర్మ తన పేలవ ఫామ్‌ను కొనసాగిస్తున్నాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇంగ్లండ్‌తో ముంబైలోని వాంఖడే మైదానం వేదికగా జరుగుతున్న సెమీఫైనల్లో అభిషేక్ శర్మ తీవ్రంగా నిరాశపర్చాడు. 7 బంతుల్లో 9 పరుగులే చేసి మరోసారి నిర్లక్ష్యపు షాట్‌కే వెనుదిరిగాడు. ఇంగ్లండ్ పార్ట్‌టైమ్ స్పిన్నర్ విల్ జాక్స్ బౌలింగ్‌లో ఔటై ఆఫ్ స్పిన్నర్ బలహీనతను బయటపెట్టుకున్నాడు. ఈ ఓవర్ ఆరంభంలో రెండు బౌండరీలతో దూకుడు కనబర్చిన అభిషేక్ శర్మ.. స్టెప్ ఔటై భారీ షాట్ ఆడే ప్రయత్నంలో క్యాచ్ ఔట్‌గా వెనుదిరిగాడు. అభిషేక్ శర్మ దూకుడును గమనించిన విల్ జాక్స్ తెలివిగా బంతి వేగాన్ని తగ్గించి ఫలితం రాబట్టాడు. ఈ ఓవర్‌లోని చివరి బంతిని విల్ జాక్స్ గంటకు 85.4 కిలోమీటర్ల వేగంతో సంధించాడు. బంతి వేగాన్ని అంచనా వేయడంలో విఫలమైన అభిషేక్ శర్మ మూల్యం చెల్లించుకున్నాడు. బ్యాట్ అంచున తాకిన బంతి గాల్లోకి లేవగా.. డీప్ మిడ్‌వికెట్‌లో ఫీల్డింగ్ చేస్తున్న ఫిల్ సాల్ట్ సునాయసంగా అందుకున్నాడు. అభిషేక్ శర్మ వికెట్‌తో తొలి వికెట్‌కు నమోదైన 20 పరుగుల భాగస్వామ్యానికి తెరపడింది.



## అక్షర్ పటేల్ కళ్లు చెదిరే క్యాచ్

టీమిండియా వైస్ కెప్టెన్, స్టార్ ఆల్‌రౌండర్ అక్షర్ పటేల్ కళ్లు చెదిరే క్యాచ్‌తో ఔరా అనిపించాడు. ఐసీసీ టీ20 ప్రపంచకప్ 2026లో భాగంగా ఇంగ్లండ్‌తో గురువారం జరిగిన సెమీఫైనల్ మ్యాచ్‌లో అక్షర్ పటేల్ కళ్లు చెదిరే ఫీల్డింగ్‌తో మ్యాచ్‌ను మలుపు తిప్పాడు. అక్షర్ స్టన్నింగ్ ఫీల్డింగ్‌కు విల్ జాక్స్(35) నిరాశగా పెవిలియన్ చేరాడు. విల్ జాక్స్ ఆడిన భారీ షాట్‌ను బౌండరీ లైన్‌పై అద్భుతంగా అందుకున్న అక్షర్ పటేల్.. బంతిని చాకచక్యంగా తన సహచర ఫీల్డర్ అయిన శివమ్ దూబేకు అందజేశాడు. దాంతో సిక్సర్ కాస్త క్యాచ్‌గా మారిపోయింది. అర్ష్‌దీప్ సింగ్ వేసిన 14వ ఓవర్‌లో ఈ ఘటన చోటు చేసుకుంది. ఈ ఓవర్ ఆఖరి బంతికి మూడు వైడ్స్ వేసిన అర్ష్‌దీప్ సింగ్.. నాలుగో ప్రయత్నంలో ఫుల్ టాస్ సంధించాడు.



## ఘనంగా అర్జున్ టెండుల్కర్ పెళ్లి

భారత క్రికెట్ దిగ్గజం సచిన్ టెండూల్కర్ తనయుడు అర్జున్ టెండూల్కర్ వివాహం అంగరంగ వైభవంగా జరిగింది. ముంబైకి చెందిన యువ వ్యాపారవేత్త సానియా చందోక్‌ను గురువారం అర్జున్ టెండూల్కర్ పెళ్లి చేసుకున్నాడు. ఈ వివాహ వేడుకకు సినీ, రాజకీయ, క్రీడా ప్రముఖులు హాజరై వధూవరులను ఆశీర్వదించారు. ప్రస్తుతం ఈ పెళ్లికి సంబంధించిన ఫొటోలు, వీడియోలు నెట్టింట వైరల్‌గా మారాయి. తన అక్క అర్జున్ టెండూల్కర్ ఫ్రెండ్ అయిన సానియా చందోక్‌తో సీక్రెట్‌గా ప్రేమాయణం నడిపిన అర్జున్ టెండూల్కర్.. పెద్దలను ఒప్పించి పెళ్లి చేసుకున్న సంగతి తెలిసిందే. ఈ ఏడాది ఆగస్టులోనే అర్జున్–సానియాల నిశ్చితార్థం అత్యంత గోప్యంగా జరిగింది. నిశ్చితార్థం అయిన కొన్ని రోజులకు సచిన్ టెండూల్కర్ ఈ విషయాన్ని ధ్రువీకరించారు.

## మాకు ఏంటీ నరకం?

ఇంటికి పోవద్దా?: విండీస్ కోచ్ సామీ

పశ్చిమాసియాలో యుద్ధం ప్రభావం వెస్టిండీస్ జట్టుపై పడింది. పొట్టి ప్రపంచకప్ సూపర్ 8 మ్యాచ్‌లో భారత జట్టు చేతిలో ఓడిన విండీస్ బృందం ఇంకా కోల్‌కతాలోనే ఉండిపోయింది. యుద్ధం కారణంగా విమాన సర్వీసులు రద్దైన నేపథ్యంలో కరీబియన్ ఆటగాళ్లు స్వదేశం వెళ్లేందుకు పడిగాపులు కాస్తున్నారు. హెడ్‌కోచ్ డారెన్ సమీ అయితే.. తీవ్ర ఆందోళన వ్యక్తం చేశాడు. నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా అని ఎక్స్ వేదికగా పోస్ట్ పెట్టాడు. కోల్‌కతాలోని ఈడెన్ గార్డెన్స్‌లో మార్చి 1 ఆదివారం సెమీస్ బెర్తు కోసం భారత్, వెస్టిండీస్ తలపడ్డాయి. కానీ, ఆ మ్యాచ్‌లో సంజూ శాంసన్ విధ్వంసంతో విండీస్ జట్టు టోర్నీ నుంచి నిష్క్రమించింది. అమెరికా, ఇజ్రాయేల్ -- ఇరాన్ యుద్ధం కారణంగా వారిని వెంటనే పంపించలేని పరిస్థితి. దాంతో.. ఆ రోజు నుంచి ఇప్పటివరకూ కరీబియన్ ఆటగాళ్లు కోల్‌కతాలోనే ఉన్నారు. ఈ పరిస్థితుల్లో ఆ జట్టు హెడ్‌కోచ్ డారెన్ సమీ ఎక్స్ పోస్ట్‌లో తన ఆవేదనను వ్యక్తం చేశాడు. 'నేను ఇంటికి వెళ్లాలనుకుంటున్నా. మమ్మల్ని ఎప్పుడు పంపిస్తారో చెప్పండి. మేము కోల్‌కతాలోనే ఉండి ఐదు రోజులైంది. ఈరోజు.. రేపు.. కాంటే వచ్చే వారం.. ఏదో ఒక రోజు పంపిస్తామని అయినా చెప్పండి' అని సమీ తన పోస్ట్‌లో రాసుకొచ్చాడు. సమీ పోస్ట్‌లో వెస్టిండీస్ క్రికెట్‌గానీ, భారత క్రికెట్ నియంత్రణ మండలిగానీ ఇంకా స్పందించలేదు.

ఈవార్తలు
ప్రజావాణి
www.evarthalu.com
నేటి ఈవార్తలు
శుక్రవారం 6-3-2026

నేటి ఈవార్తలు
సంపాదకీయం

# ఏఐ.. ఏమిటీ మాయ?

నేడు ప్రపంచవ్యాప్తంగా సాంకేతిక రంగంలో జరుగుతున్న విప్లవాత్మక మార్పుల్లో కృత్రిమ మేధ అగ్రస్థానంలో ఉంది. శ్రమ, సమయం, ఖర్చులను తగ్గించి ఉత్పాదకతను పెంచేందుకు ఇది అద్భుతమైన సాధనంగా అవతరించింది. అయితే, ఈ సాంకేతికత ఎంత వేగంగా విస్తరిస్తోందో, అంతే స్థాయిలో సరికొత్త సవాళ్లను కూడా విసురుతోంది. ఏఐ యంత్రీకరణ వల్ల సాఫ్ట్‌వేర్, డేటా ఎంట్రీ, కస్టమర్ సర్వీస్ వంటి రంగాల్లో మానవ శ్రమ అవసరం తగ్గుతోంది. ఇది ఆర్థికంగా వెనుకబడిన వర్గాలపై తీవ్ర ప్రభావం చూపే ప్రమాదం ఉంది. డీప్‌ఫేక్ వీడియోలు, చిత్రాల ద్వారా వ్యక్తుల ప్రతిష్టను భంగపరచడం, నకిలీ వార్తలతో సమాజాన్ని తప్పుదోవ పట్టించడం వంటివి పెను సంక్షోభానికి దారి తీస్తాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. డేటా విశ్లేషణ పేరుతో ప్రజల వ్యక్తిగత వివరాలను సేకరించడం, వాటిని దుర్వినియోగం చేయడం వల్ల భద్రతా పరమైన ముప్పులు పొంచి ఉన్నాయి. నిర్ణయాలు తీసుకునే క్రమంలో ఏఐ కేవలం డేటాపై ఆధారపడుతుంది. దీనివల్ల జాతి, వర్ణ వివక్ష వంటి పక్షపాత వైఖరులు తలెత్తే అవకాశం ఉంది. విద్యార్థులు తమ మేధస్సుకు పదును పెట్టకుండా ప్రతి చిన్న పనికి ఏఐపై ఆధారపడటం వల్ల వారి ఆలోచనా శక్తి, విశ్లేషణా సామర్థ్యం తగ్గే ప్రమాదం ఉంది. భారత ప్రభుత్వం ఇండియా ఏఐ మిషన్ వంటి కార్యక్రమాల ద్వారా ఏఐ ఆవిష్కరణలను ప్రోత్సహిస్తూనే, బాధ్యతాయుత వినియోగంపై దృష్టి సారిస్తోంది. మానవ విలువలకూ, నైతికతకూ పెద్దపీట వేస్తూ ఏఐ నియంత్రణకు పటిష్టమైన చట్టాలు తీసుకురావాల్సిన అవసరం ఉంది. కృత్రిమ మేధ అనేది రెండు వైపులా పదునున్న కత్తి వంటిది. దానిని మానవాళి అభివృద్ధికి వరంగా మార్చుకోవాలా లేదా శాపంగా మలచుకోవాలా అనేది మనం రూపొందించుకునే నిబంధనలు, పాటించే నైతిక విలువలపైనే ఆధారపడి ఉంటుంది. సాంకేతికతకు మానవీయ కోణాన్ని జోడించినప్పుడే అసలైన ప్రగతి సాధ్యమవుతుంది.



# వెలుగుల దివిటీ


మనమంతా ఒక్కటవ్వాలి
నేడే హోలీ
ఆడే పాడే ఆనందాల హేళి
జానపదుల జావళి
జాజిరి పాటల మంజరి
'హోలీకా'పై విజయభేరి
వసంతోత్సవ కేళీ
రంగురంగుల రంగేళి
కుల మత భేదాల్ని వీడి
మనమంతా ఏకమవ్వాలి
ప్రకృతి దోసిట్లో రంగులన్నీ
దాగితే కమ్ముకున్న చిమ్మ చీకటి
దోసిట్లోంచి ఒక్కో రంగు
ఒలికితే వెలుగుల దివిటీ
ఆ దివిటీల వెలుగుల్లో
తిమిరాన్ని తరిమే
ఆనందాల డోలిక
భోగి మంటల్లో
కాముని దహన వేదిక
తనలోని కొత్త రంగుల్ని చూసి
పుడమి పులకించే వేడుక
సప్తవర్ణాల దృశ్యమాలిక
ప్రకృతి పరవశించి
కోయిలతో పాడే రుతు గీతిక
శిశిరానికి సెలవంటూ
వసంతం ఒడిలోకి హోలీ చేరిక



- డా.రానవేయిన రమేశ్
అసిస్టెంట్ ప్రొఫెసర్,
ప్రభుత్వ ఈఎన్టీ హాస్పిటల్,
కోఠి, హైదరాబాద్

# 'అనగా అనగా' నుండి 'అనఘా సహస్రము' దాకా

వివిధ ప్రక్రియల్లో అలవోకగా రచనలు చేస్తున్న సమకాలిక రచయితల్లో పోచంపల్లి సుదర్శన్ రావు కూడా ఒకరు. నవల, కథ, కవిత్వం, శతకం మొదలైన ప్రక్రియల్లో అందె వేసిన చేయిగా ఆయనను పేర్కొనవచ్చు. యాదాద్రి- భువనగిరి జిల్లాకు చెందిన సుదర్శన్ రావు ఆయా ప్రక్రియల్లో ఇప్పటికే గ్రంథాలను కూడా వెలువరించారు. పోచంపల్లి శతకం, వినయశీల శతకం, 'ముకుందం' అనే ఖండకావ్యం, 'భీష్మోపదేశం' అనే నవల, 'సుదర్శన శతక మంజరి' తదితరాలు పాఠకులు మెచ్చిన సుదర్శన్ రావు గారి రచనలు. 'సుదర్శన శతక మంజరి'లో విశ్వగాథశతకం, అమృతధార శతకం, కనకధార శతకం, కలియుగ గరిమ శతకం, సుగుణ శాతకం, అష్టోత్తర శతనీతి శతకం అనే ఆరు శతకాలున్నాయి. ఇప్పటికే 50 కి పైగా కథలను కూడా ఆయన రచించడాన్ని ఇక్కడ ప్రస్తావించుకోవాల్సిన అవసరం ఉంది. సమాజంలో మార్పు రావాలన్న ఆకాంక్ష ఆయన ప్రతి రచనలోనూ సుస్పష్టంగా కనబడుతుంది. నీతివంతమైన సమాజ నిర్మాణం జరగాలని ఆయన కోరిక. ఆయన రచనలన్నీ ఈ దిశగానే ఉంటాయి. ఆయన రాసిన 'భీష్మోపదేశం' నవల ఈ అంశం చుట్టూనే పరిభ్రమిస్తుంది. నేటి తరానికి అవసరమైన ఉత్తమ లక్షణాలను ఆ నవలలో రచయిత స్పష్టంగా పేర్కొన్నారు. సులువుగా నోటిపై ఆడేలా ఉండే ఛందోరీతి, లయ శతకాన్ని పామరులకు సైతం దగ్గర చేస్తాయి. ముక్తక లక్షణం శతక పద్య జనరంజకతకు మరో కారణం. అందువల్లే సూక్తులు, సుభాషితాలను సమాజానికి చేరువ చేసేందుకు శతకాలు ప్రధానపాత్ర పోషించాయి. సుమతీ శతకం, వేమన శతకం ఈ విషయాన్ని నిరూపించాయి. ఇప్పటికే శతక రచనలో మంచి పేరు తెచ్చుకున్న సుదర్శన్ రావు గారు ఈసారి సహస్ర రచనకు ఉపక్రమించి, కృత్యకృత్యులయ్యారు. ఆ విధంగా చూస్తే 'అనగా అనగా' అంటూ కథలతో ప్రారంభమైన సుదర్శన్ రావు ఇప్పుడీ 'అనఘా సహస్రము' ముద్రణరూపంలోకి తెచ్చారు. ఈ సహస్రాన్ని ప్రతిపద్యంలో చివరి పాదం మొత్తం మకుటంగా ఉండే పద్ధతి కాకుండా సుమతీశతకం ఉన్న విధంగా చివరి పాదంలోని చివరి పదం మాత్రమే మకుటంగా ఉండే పద్ధతిని స్వీకరించారు. ఈ సహస్ర మకుటం 'అనఘా'. అంటే 'దురలవాట్లు లేనివాడా!' అని అర్థం. సమాజంలోని వ్యక్తులు సదాచార శోభితులు కావాలన్న కవి ఆకాంక్షకు ఈ మకుటం అద్దం పడుతోంది. ఎలాంటి పాపాలూ చేయకుండా నిర్మలంగా ఉండాలన్న



సూచన ఈ మకుటంలోనే ధ్వనిస్తోంది. ఈ సహస్రంలోనివన్నీ కంద పద్యాలే. 'తనకు మాలిన ధర్మం మొదలు చెడ్డ బేరం' అంటారు పెద్దలు. దానధర్మాలు చేసేవారు విచక్షణ పాటించవలసిందే. యుక్తాయుక్త విచక్షణ లేకపోతే అపాత్ర దానం జరుగుతుంది. చేసిన దానం ఉపయోగపడకపోగా శక్తికి మించి చేసే దానాలు దాత కుటుంబానికి కూడా నష్టం కలిగిస్తాయి.

సతతమువితరణఅనగను
సుతలకుసుతులకుసహితముసుంతయులేకన్
వెతలనుబడుటికకలుగును
అతలాకుతలపుబతుకిగఅగునికఅనఘా

కుటుంబ క్షేమాన్ని ముందుగా చూసుకోకుండా దానాలు చేసేవారికి ఇది వర్తిస్తుంది. తన కోసం, తన కుటుంబం కోసం ముందు ఆలోచించిన తర్వాతే దానధర్మాలు చేయాలని ఈ పద్యం ఉద్బోధిస్తుంది.

పర్యావరణానికి ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ చేసే నష్టాలపై ఇప్పటికే ప్రభుత్వం, వివిధ సంస్థలు ప్రచారం నిర్వహిస్తున్నాయి. వినాయక చవితి సమయంలో ప్లాస్టర్ ఆఫ్ ప్యారిస్ తో చేసే వినాయక విగ్రహాలను నిమజ్జనం చేయడం వల్ల చెరువులు, కుంటలు కలుషితం అవుతున్నాయి. అందువల్లే మట్టి వినాయకుడే ఉత్తమమని ఇప్పుడు అందరూ భావిస్తున్నారు. ఈ అంశంపై సుదర్శన్ రావు గారు రాసిన పద్యమిది.

మట్టితొగణపతిబెట్టుము
మట్టిలొగలవనసకలముమహిమలుజూడన్
మట్టియెలక్ష్మికినిలయము
మట్టియెదిశయనమనుషులమనుగడఅనఘా

ఈ విధంగా పర్యావరణ సమస్యలపై కూడా సుదర్శన్ రావు గారి కలం దృష్టి పెట్టిందని చెప్పవచ్చు.

పాఠశాలలు కేవలం అకడమిక్ అంశాలకే పరిమితమయితే సరిపోదు. పిల్లల్లో అవసరమయ్యే జీవన నైపుణ్యాల కల్పనకు సహపాఠ్య కార్యక్రమాల నిర్వహణ కూడా పాఠశాలల్లో తప్పనిసరి. ఈ విషయాన్నే కింది పద్యంలో ప్రస్తావిస్తారు కవి.

పద్యముపాటలుఆటలు
విద్యలొభాగమెమనిషికివినగనునరుడా
విద్యలవలననెవినయము
విద్యలసారమువినగనువిశదముఅనఘా

ఆటలు, పాటలతో పాటు పద్యం కూడా విద్యలో భాగమేనని ఇక్కడ కవి అభిప్రాయపడుతున్నారు. పాఠశాల విద్యలో సహపాఠ్య అంశాలను కూడా తప్పనిసరిగా బోధించాలని సుదర్శన్ రావు అభిప్రాయం. విద్య వల్లే వినయం సాధ్యమని కూడా చెప్పడాన్ని గమనించవచ్చు.

'ఉప్పు లేని కూర యొప్పదు రుచులకు' అన్నాడు వేమన శతక కర్త. ఇప్పుడు కాలం మారింది. ఆరోగ్య రీత్యా ఉప్పును మితంగా తీసుకోవాలని చెప్తున్నారు వైద్యులు. ఆధునికుడైన సుదర్శన్ రావు సహస్రంలోనూ ఇదే భావన వ్యక్తమవుతుంది.

ఉప్పునుదినకుముఅధికము
చెప్పుమువలదనిపదుగురుచేరినచోటన్
కొప్పునుదులుపకుబయటను
దెప్పుడుపలుకులువలదికదేహికిఅనఫ
రా

లవణాన్ని ఎక్కువగా తీసుకోకపోవడమే కాదు, ఆ దిశగా ప్రచారం కూడా చేయాలని సూచిస్తున్నారు కవి.

పుత్రోత్సాహము తండ్రికి
పుత్రుడు జన్మించినపుడె పుట్టదు, జనులా
పుత్రుని గనుగొని పొగడగ
పుత్రోత్సాహంబు నాడు పొందుర సుమతీ!

సుమతీ శతక కర్త ఎప్పుడో వ్యక్తం చేసిన అభిప్రాయమిది. పుత్రుడు పుట్టగానే పుత్రోత్సాహం కాదు, పుత్రుడు ఏదైనా విజయం సాధిస్తే ఆ తల్లిదండ్రులకు అప్పుడే పుత్రోత్సాహం కలుగుతుందని దాని అర్థం. ఇదే విధమైన అభిప్రాయాన్ని సహస్రంలో ప్రకటిస్తారు సుదర్శన్ రావు.

పుత్రులుగలుగగపొంగకు
పుత్రులుబుద్ధిగబెరుగుచుపుడమినకీర్తిన్
శత్రువులనకనుఉండిన
పుత్రులబొగడుముమనసునపూర్తిగఅనఘా

సుమతీ శతక కర్త అభిప్రాయాన్ని సమర్థిస్తూ రాసిన పద్యమిది. అయితే సుమతీ శతకంలో పేర్కొన్న అభిప్రాయం నిత్యసత్యంలా ఉంటే సుదర్శన్ రావు అభిప్రాయం తల్లిదండ్రులకు సూచనలిస్తూ సాగుతుంది. సంతానం బుద్ధిగా పెరగాలి. కీర్తి పొందాలి. పైగా అజాత శత్రువుగా ఉండాలి. పొగడడం కూడా పైకి కాకుండా మనసులోనే పొగడాలన్నది సుదర్శన్ రావు అభిప్రాయం. తల్లిదండ్రులు పైకి పొగడడం వల్ల పిల్లల్లో అహంకారం పెరిగే అవకాశం ఉంది. అందువల్లే తమ పిల్లలపై ప్రశంసను మనసులోనే వ్యక్తీకరించాలని కవి భావం. ఇలాంటి ఎన్నో సూక్తులు, సుభాషితాలు 'అనఘా సహస్రం'లో ఉన్నాయి. సందేశాత్మక రచనలతో జరుగుతున్న ఈ కృషి ఇంకా కొనసాగాలని ఆకాంక్షిస్తున్నాను. భవిష్యత్ తరాల్లో ఉత్తమ లక్షణాలు పాదుకొల్పేదిశగా కృషి చేస్తున్న పోచంపల్లి సుదర్శన్ రావు అభినందనీయులు.



-డాక్టర్ రాయారావు సూర్యప్రకాశ్ రావు
అధ్యక్షుడు, దర్పణం సాహిత్య వేదిక
సెల్: 9441046839

# ఉద్వేగాలతో ఊగిపోతారు!

విలువలు లేని విద్య
అది నేర్చినా ఒకటే
నేర్వకున్నా ఒకటే

గురువు అంటే తండ్రి అనే
అర్థంమరిచిన కుసంస్కారులు
గురువు మీదే చేయిచేసుకున్న
పరమకంత్రిగాళ్ళు
పోరంబోకులు

గవర్నమెంట్ స్కూల్లో
చదివే విద్యార్థులంటే
యాచకుల పిల్లలు
ఎస్సీ ఎస్టీ ఎమ్ బీసీ వారే కదా

తల్లిదండ్రులను కాకా పట్టడం
ఆన్లైన్ చదువులనో ఫోనుంటే
బాగా చదివి మిమ్మల్ని ఉద్ధరిస్తామని
మభ్యపెట్టడంతో వారు ఈఎంఐలో
స్మార్ట్ ఫోనుకొనడం..
ఇక పిల్లల పోకిరితనం షురూ
స్మార్ట్ ఫోన్‌లో సోషల్ మీడియా సైట్స్
యూట్యూబ్
ఇన్‌స్టాగ్రామ్
ఫేస్బుక్‌లో రీల్స్
అడ్డూఅదుపు లేని వల్గర్ కంటెంట్ చూస్తూ
విద్యార్థులు తప్పు దోవ పడుతున్నారు..!

ఇంట్లో తల్లిదండ్రులు
తమ పిల్లల కడుపు నింపడానికి
ప్రొద్దంత కాయకష్టం
ఈ పిల్లలేమో బలాదూర్ తిరుగుడు
గ్యాంగ్ మెయింటెయిన్ చేయడం
మద్యం సేవించడం
గంజాయి దమ్ములాగడం
అమ్మాయిలను ఆటపట్టించడం
వాడు చేసింది
తప్పని ఎవడూ చెప్పొద్దూ
మితిమీరినతప్పులతో
తప్పని తేలితే
బాలనేరస్థులుగా ముద్రపడడం
జైలు జీవితం
తప్పును తప్పు అని చెప్పే
గురుస్థానం
కళతప్పిందిప్పుడు
గురువంటే తానో పాయింటర్
తప్పితే మరేమీ కాదు

వెధవ బడవ
బడుద్దాయి
అనే మాటలు కూడా అనలేని
గురువులు
విద్యాకమీషన్లు
విద్యాహక్కు చట్టాలు
విద్యార్థి కేంద్రంగా ఉండడం
గురువు గౌరవాన్ని
ప్రతిష్టను దిగజార్చడమేకదా
ఉపాధ్యాయ విధులను ప్రస్తావించిన
కమీషన్లు విద్యార్థి బాధ్యతల
గురించి తెలుపకపోవడం
ఈ విచ్చలవిడితనానికి పరాకాష్ట

ఈ రోజుల్లో తరగతి గదుల్లో గురువులు
పాఠాలు చెప్పడం అంటే ఏ మూల విద్యార్థి నుండి
ఎలాంటి విపత్తు పొంచివుందో
నన్న భయం నిలువెల్లా కమ్ముకుంటుంది.

ఈ పరమపోకిరీలకు
నిత్యం రకరకాల ఉద్వేగాలతో
ఊగిపోయే విద్యార్థులకు
పాఠాలు చెప్పడం కన్నా
పచారీ కొట్టులో పద్దులు వ్రాయడం
ఉత్తమం అని అనుకుంటున్నారు
గురుదేవుళ్లు

అంకాల సోమయ్య, దేవరుప్పుల, జనగాం
ఫోన్ నంబర్: 9640748497

రచయితలకు ఆహ్వానం!

సమాజాన్ని మేల్కొల్పుదామా..
యువతకు మార్గం చూపుదామా..
విద్యార్థులకు మార్గదర్శనం చేద్దామా..
న్యాయ, వైద్య సలహాలు చెబుదామా..
వ్యాపార మెలకువలు నేర్పుదామా..
మీ జ్ఞానాన్ని పంచే ఆలోచనతో ఉన్నారా..
అయితే, మీ రచనలకు పదును పెట్టండి..
మీ అభిప్రాయాలను రాతగా మార్చండి..
'ప్రజావాణి' వేదికగా ప్రజలకు దగ్గరవ్వండి..
నేటి 'ఈవార్తలు' పత్రికతో మమేకమవ్వండి..
కథలు, కవితలు, వ్యాసాలు ఏవైనా..
మీ సొంత సమాచారం.. మీ బైలైన్‌తో..!



పంపాల్సిన చిరునామా:
మెయిల్: contact@evarthalu.com
వాట్సాప్ నంబర్: 9440455811

This newspaper is Owned and Published by BOMMAKANTI SHRAVAN KUMAR from H.No.4-36, Balwanthapoor, Mallial, Jagitial District, Telangana, 505452, Phone Number: 9440455811. Edited by BOMMAKANTI SHRAVAN KUMAR and Printed by M/s Kakatiya Printers at #2-24-96/9, Near Sri Krishna Pharma, Laxminarayana Nagar, Ida Uppal, Medchal Malkajgiri District, Telangana, 500039. Corporate Office: #1-5-431/20/4, GS Pride, Plot No.4, Jonnabanda, Old Alwal, Medchal Malkajgiri District, Telangana, 500010. Landline: 040-35673004.